# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ 10.12.2024 | 24 క్యారెట్లు 77,315.00 | కిలో వెండి 99,890.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:48

www.vishalabharati.com




## మోహన్‌బాబు, మనోజ్ తన్నుకున్నది నిజమే..

- మంచు కుటుంబంలో ఆస్తి గొడవలు
- జల్‌పల్లి ఫాంహౌస్ కేంద్రంగా కొట్లాట
- గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు మనోజ్ కంప్లైంట్
- మనోజ్, మౌనికపై పోలీసులకు మోహన్‌బాబు ఫిర్యాదు
- తనకు ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు

2 లో

# అవినీతి నుంచి అభివృద్ధి వైపు..

## డిసెంబర్ 9.. చరిత్రలో నిలిచిపోయే రోజు

- మన సంస్కృతి, సంప్రదాయానికి ప్రతిరూపం తెలంగాణ తల్లి
- తెలంగాణ తల్లిని చూస్తే కన్నతల్లి రూపం స్ఫురిస్తోంది
- ప్రతి ఏటా తెలంగాణ తల్లి అవతరణ వేడుకలు
- తెలంగాణ తల్లిని అవమానిస్తే కఠిన చర్యలు
- గత పదేళ్లలో అన్నింటా వివక్షే
- కవులు, కళాకారులను గుర్తించి సన్మానిస్తాం
- 9 మంది కవులకు రూ.కోటి నగదు, 300 గజాల స్థలం
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే టీఎస్‌ను టీజీగా మార్చాం
- సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం వైపు నడిపిస్తాం
- విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి




విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసిన ఈ రోజు (డిసెంబర్ 9) చరిత్రలో నిలిచిపోతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం నాడు సచివాలయంలో నూతనంగా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్ర, సంస్కృతి ఎన్నో ఏళ్లు అవహేళనకు గురైందని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ తల్లి ప్రతిరూపమని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతీ ఏడాది డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో తెలంగాణ తల్లి విగ్రహ నమూనాను మార్చినా.. ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి తెలిపారు.భూలోకంలో ఏ ప్రాంతానికైనా, ఎవరికైనా తల్లితోనే గుర్తింపు ఉంటుందని రేవంత్ రెడ్డి తెలిపారు. చిన్నప్పుడు తన తల్లి ఎలా ఉందో.. ఇపుడు కూడా తెలంగాణ తల్లి అలానే ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సంస్కృతిపై దాడి చేయడమే కాదు... అవమానించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత ఒక వ్యక్తి, ఒక రాజకీయ పార్టీ తమ గురించి మాత్రమే ఆలోచించి..

### ప్రతి ఏటా తెలంగాణ తల్లి అవరతణ ఉత్సవాలు..



కొంతమందికి బాధ, ఆవేదన, దుఃఖం ఉండొచ్చని.. వాళ్ల రాజకీయ మనుగడకు ఈ నిర్ణయాలు ప్రమాదకరమని వాళ్లు అనుకోవచ్చన్న రేవంత్ రెడ్డి.. కానీ ఒక కుటుంబం కోసమో, ఒక రాజకీయ పార్టీ కోసమో తెలంగాణ సాధించుకోలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అవమానాలు ఎదుర్కొన్నామన్నారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాతా తెలంగాణలో పదేళ్లు నిర్లక్ష్యానికి గురయ్యామన్నారు. ఇక అలాంటి అవమానాలు, నిర్లక్ష్యాలు ఉండకూడదని ప్రతీ ఏడాది డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ వేడుకలు ప్రభుత్వ పరంగా నిర్వహిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు.

..మిగతా 2 లో



## ఆర్.కృష్ణయ్యకు జాక్‌పాట్

- బీజేపీ రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక
- కమలం పార్టీలో చేరిన బీసీ నేత

6 లో

## శాసనసభ ఈ నెల 16కు వాయిదా


- బీఆర్ఎస్‌సభ్యుల నిరసనలు.. అరెస్ట్
- విగ్రహ నమూనాపై సీఎం రేవంత్ వివరణ

3 లో

## గ్రూప్ 2 పరీక్షల వాయిదా కుదరదు

- హైకోర్టు సంచలన తీర్పు
- రైల్వే పరీక్ష ఉన్నందున రద్దు చేయాలని పిటిషన్
- లక్షల మంది నష్టపోతారన్న టీజీపీఎస్సీ
- రద్దు చేయడం కుదరదన్న న్యాయస్థానం

4 లో



## తెలంగాణ తల్లి కాదు... కాంగ్రెస్ తల్లి

- కొత్త విగ్రహ రూపంపై కేటీఆర్ విమర్శలు
- తెలంగాణ తల్లి ఆకృతిని ఎవరు మార్చమన్నారు
- కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేసేందుకు కుట్ర
- సీఎం రేవంత్ తెలంగాణ ద్రోహి
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికారం మాదే
- పాత తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించిన కేటీఆర్

విశాలభారతి, స్టేట్‌బ్యూరో:

తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. సోమవారం నాడు సెక్రటేరియట్ లో రేవంత్ రెడ్డి ఆవిష్కరించింది 'తెలంగాణ తల్లి కాదని.. కాంగ్రెస్ తల్లి' అని విమర్శించారు. భారతమాత స్ఫూర్తిగా మహత్తర పోరాటంలో తెలంగాణ తల్లి ఉద్భవించిందని అన్నారు. ప్రభుత్వాలు మారితే తలరాతలు మారాలే కానీ, తల్లులు మారాలా? బతుకమ్మను మాయం చేయడమంటే మన సంస్కృతిపై దాడి అన్నట్లే.

..మిగతా 3 లో

## చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడే

### తేల్చిచెప్పిన హైకోర్టు

3 లో

- వేములవాడ మాజీ ఎమ్మెల్యేకు బిగ్ షాక్
- పౌరసత్వం కేసులో రమేశ్ పిటిషన్ కొట్టివేత
- చెన్నమనేనికి రూ. 30 లక్షలు ఫైన్



## దళితులకు ఉన్నత విద్య అందని ద్రాక్షేనా..?

- కోరుట్ల వ్యవసాయ కళాశాలలో ప్రవేశాలు ఎప్పుడు..?
- ఇప్పటిదాకా నోటిఫికేషన్ ఇవ్వని సర్కారు
- అర్ధ సంవత్సరం గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- తక్షణమే ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి
- ప్రజావాణిలో బీజేపీ నేత నారపాక అశోక్‌వినతి

2 లో






## 'ఆశ'లపై నిర్బంధకాండ..

- పోలీసులు, ఆశ కార్యకర్తల మధ్య గొడవ
- 18 వేల వేతనం ఇవ్వాలని ఆశల డిమాండ్
- పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించి నిరసనలు
- డీఎంఈ కార్యాలయం వద్ద ఉద్రిక్తత
- ఆశలపై చేయి చేసుకున్న మగ పోలీసులు

2 లో



## సోనియా లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు

- డిసెంబర్ 9.. 4 కోట్ల ప్రజల కోరిక తీరిన రోజు
- విగ్రహావిష్కరణపై ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతం
- పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు ఏమీ రాలే
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్
- పాత విగ్రహానిది కవిత రూపం
- శాసనసభలో మంత్రి సీతక్క ఫైర్

3 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
10.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ట్యాంక్‌బండ్‌పై జన నీరాజనం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి కొత్త విగ్రహాన్ని మంత్రులు, అధికారుల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అయితే, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. దీంతో సచివాలయం, ట్యాంక్ బండ్ పరిసరాలు జనసంద్రంగా మారాయి. విగ్రహ ఆవిష్కరణ విజువల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. తెలంగాణ తల్లి కొత్త విగ్రహాన్ని దూరం నుంచే ప్రజలు తమ ఫోన్‌లల్లో ఫోటోలు తీస్తూ ఖుష్ అవుతున్నారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా మూడు రోజుల పాటు ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు. నేటితో ఈ విజయోత్సవాలు ముగిశాయి.



## ‘ఆశ’లపై నిర్బంధకాండ..

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్‌లో రాజకీయ పరిస్థితులు గందరగోళంగా మారాయి. ఓవైపు.. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కాగా మరోవైపు.. బీఆఎస్ నేతల ఆందోళనలు, ఇదే క్రమంలోనే ఆశావర్కర్ల నిరసనలతో హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా పరిస్థితి వేడెక్కింది. కోఠిలోని డీఎంఈ కార్యాలయం గేటు ముందు ఆశావర్కర్లు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. ఆశావర్కర్లు పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించారు. రంగంలోకి దిగిన పోలీసులు.. ఆశావర్కర్లను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆశావర్కర్లకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో.. కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆశాలను పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితి విషమించడంతో పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేశారు. దీంతో డీఎంఈ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఈ క్రమంలోనే.. ఆశావర్కర్ల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. మహిళా పోలీసులతో పాటు మగ పోలీసులు కూడా చేరి.. ఆశాలను వ్యాన్లలోకి లాగి పడేశారు. అందులోనూ.. ఏసీపీ శంకర్ మరీ ఎక్కువ అత్యుత్సాహం ప్రదర్శించారు. అక్కడ మహిళా కానిస్టేబుళ్లు ఉన్నప్పటికీ.. ఆశావర్కర్లను లాగేసేందుకు ఎక్కువ ఉత్సాహం కనబరిచారు ఏసీపీ శంకర్. మహిళను చేతులు పట్టి లాగటం, పట్టిలాగెయ్యండంటూ మహిళా కానిస్టేబుళ్లను ఆదేశించటం.. ఈ క్రమంలో ఆ కానిస్టేబుళ్లను కూడా ఇష్టమున్నట్టు మోచేతులతో తోసెయ్యటం, ఎక్కడెక్కడో తాకటం లాంటి పనులు చేసిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలోనే..ఏసీపీ శంకర్ మీదికి ఆశావర్కర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరోవైపు.. ఓ ఆశావర్కర్‌ను వ్యాన్ ఎక్కించి డోర్ వేస్తున్న సమయంలో.. ఆమె సుల్తాన్ బజార్ సీఐ శ్రీనివాస్ చారిపై చేయి చేసుకుంది. సీఐ చెంప చెల్లుమనిపించాటాన్ని గుర్తించిన.. పోలీసులు ఆశావర్కర్‌పైన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట మహిళా కానిస్టేబుళ్లు ఎగిరి మరీ ఆమెపై చేయి చేసుకోగా.. పురుష కానిస్టేబుళ్లు కూడా ఆమెను కొట్టేందుకు ఉత్సాహం చూపించారు. ఇదే గ్యాప్‌లో ఏసీపీ శంకర్ సైతం మరింత ఉత్సాహం చూపించారు. ఎగిరి మరీ ఆ ఆశావర్కర్ చీరపట్టి లాగారు. దీంతో.. వ్యాన్‌లో ఉన్న ఓ మహిళా కానిస్టేబుల్ వారించి.. చీరను సరి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంతకూ ఆ ఆశావర్కర్ ఎందుకు చేయి చేసుకుందని ఆరా తీస్తే.. వ్యాన్‌లో ఎక్కించినప్పుడు పురుష పోలీసులు తనను అసభ్యకరంగా తాకారని.. పైగా వ్యాన్‌లోకి తోసేసి డోర్ వేస్తున్న సమయంలో తన కాలు అందులో ఇరుక్కుందని ఎంత చెప్పినా వినిపించుకోలేదని.. అందుకే కోపంతో తాను చేయి లేపానని.. ఆ ఆశావర్కర్ వివరణ ఇచ్చారు. అంతేకాకుండా.. సీఐ శ్రీనివాస్ చారి పరుష పదజాలంతో తిట్టారంటూ ఆశావర్కర్లు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఈ తోపులాటలో ఓ ఆశావర్కర్ స్పృహతప్పి పడిపోయింది. అయినా సరే.. ఆమెను ఏమాత్రం పట్టించుకోకుండా మహిళా కానిస్టేబుళ్లు, పురుషకానిస్టేబుళ్లు, ఉన్నత స్థాయి పోలీసులు కూడా ఆమె పక్క నుంచే వెళ్తూ.. మిగతా ఆశావర్కర్లపైన తమ ప్రతాపం చూపించే ప్రయత్నం చేయటం శోచనీయమని.. పలువురు మహిళలు వాపోతున్నారు. చాలాసేపటి వరకు ఆమెను పట్టించుకోకుండానే ఉన్నారని.. ఎంతసేపటికీ కళ్లు తెరవకపోవటంతో మిగతా మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా.. అప్పుడు అంబులెన్సులో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

## దళితులకు ఉన్నత విద్య అందని ద్రాక్షేనా..?

- కోరుట్ల వ్యవసాయ కళాశాలలో ప్రవేశాలు ఎప్పుడు..?
- ఇప్పటిదాకా నోటిఫికేషన్ ఇవ్వని సర్కారు
- అర్ధ సంవత్సరం గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- తక్షణమే ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి
- ప్రజావాణిలో బీజేపీ నేత నారపాక అశోక్‌వినతి




విశాలభారతి, జగిత్యాల:

దళితులకు వ్యవసాయ విద్య అందని ద్రాక్షగానే మిగలనుందా..? ప్రభుత్వ అధికారుల తీరు చూస్తే అవుననే సమాధానం వినిపిస్తోంది. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమై అర్ధ సంవత్సరం గడుస్తోంది. అయినప్పటికీ జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యవసాయ కళాశాలలో ఇప్పటికీ ప్రవేశాలకు నోటిఫికేషన్‌వెలువడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీన్నిబట్టి చూస్తే దళిత విద్యార్థుల చదువులపై ప్రభుత్వానికి, అధికారులకు ఎంత అశ్రద్ధ ఉందో ఇట్టే తెలిసిపోతుంది. 2023లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జగిత్యాల జిల్లాలోని కోరుట్లలో తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాలను మంజూరు చేసింది. పట్టణంలోని అల్లమయ్య గుట్ట ఎస్సీ హాస్టల్ భవనంలో కళాశాలను ఏర్పాటు చేసి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరం తరగతులను నిర్వహించింది. అయితే 2023 డిసెంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. అయితే 2024-25కు సంబంధించి కళాశాలలో ప్రవేశాల కోసం ఇప్పటివరకు అధికారులు నోటిఫికేషన్‌ఇవ్వలేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడకపోవడంతో వ్యవసాయ విద్య చదవాలనుకున్న దళిత విద్యార్థులు ఏం చేయాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. తమకు ఉన్నత విద్య అందని ద్రాక్షేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అసమర్థతపై ప్రతిపక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ కళాశాలలో వెంటనే నోటిఫికేషన్ఇచ్చి ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

### తక్షణమే ప్రవేశాలు కల్పించాలి: బీజేపీ నేత నారపాక అశోక్

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యవసాయ కళాశాలలో తక్షణమే ప్రవేశాల కోసం నోటిఫికేషన్ ఇవ్వాలని బీజేపీ యువ నాయకులు నారపాక అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం నాడు ప్రజా వాణిలో జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్‌లతకు వినతి తప్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ కొడిమ్యాల మండల పార్టీ కార్యదర్శి పొనుగంటి రమణాచారితో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2023లో గత ప్రభుత్వం జగిత్యాల జిల్లాకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల మంజూరు చేసి.. వెంటనే ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇచ్చి.. బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరం తరగతులను నిర్వహించిందని తెలిపారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవగాహన లోపంతో గురుకులాలను అంధకారంలోకి నెట్టివేస్తూ షెడ్యూల్ కులాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందని ద్రాక్షగా మారుస్తున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి అర్ధ సంవత్సరం పూర్తవుతున్నా ఇప్పటివరకు అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ ఇవ్వడం లేదన్నారు. దీనివల్ల రాష్ట్రంలోని షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థినిలందరికీ ఉన్నత విద్యను దూరం చేసినట్లు అవుతుందన్నారు. ప్రవేశాల ప్రకటన ఆలస్యం చేయడం నిమ్నజాతి వర్గాలను అణచివేయాలనే రెడ్డి కుల, అగ్రవర్ణాల కుట్రలో భాగమే అని దళిత సమాజం భావించక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడి నేటికీ ఏడాది పూర్తవుతున్నా కూడా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖకు ఇప్పటివరకు మంత్రి లేరని.. ఈ శాఖను సీఎం రేవంత్ రెడ్డి తన దగ్గర పెట్టుకొని కావాలనే గురుకుల వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాడని ఆరోపించారు. వెంటనే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిపి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ కు మంత్రిని నియమించాలని.. గురుకులాల పైన శ్రద్ధ వహించి సంపూర్ణ సమాచారం తెప్పించుకొని సౌకర్యాలను మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. 2024 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, మహాత్మా జ్యోతిబాపూలే వ్యవసాయ కళాశాల కరీంనగర్‌లలో అడ్మిషన్ ప్రక్రియ పూర్తి అయిపోయిందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి జగిత్యాల జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలో నడుస్తున్న వ్యవసాయ కళాశాలలో ప్రవేశాల ప్రకటన విడుదల చేసి విద్యార్థుల బంగారు భవిష్యత్‌కి పునాదులు వేయాలని డిమాండ్ చేశారు. ప్రవేశాలకు ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిందని.. ప్రభుత్వ అసమర్ధతతో మరింత ఆలస్యం జరిగితే రాబోయే పరిమాణాలు తీవ్రంగా ఉంటాయని నారపాక అశోక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు



## మోహన్‌బాబు, మనోజ్ తన్నుకున్నది నిజమే..

- మంచు కుటుంబంలో ఆస్తి గొడవలు
- జల్‌పల్లి ఫాంహౌస్ కేంద్రంగా కొట్లాట
- గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు మనోజ్‌కంప్లైంట్
- మనోజ్, మౌనికపై పోలీసులకు మోహన్‌బాబు ఫిర్యాదు
- తనకు ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

టాలీవుడ్ యాక్టర్ మంచు మోహన్ బాబు ఫ్యామిలీలో హైడ్రామా కొనసాగుతోంది. ఇప్పటికే మోహన్‌బాబు, కుమారుడు మంచు మనోజ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. మంచు మనోజ్ కాళ్లకు గాయాలవడంతో బంజారాహిల్స్‌లోని టీఎక్స్ ఆస్పత్రిలో చేరాడు. తాజాగా ఈ వ్యవహారంలో మంచు మనోజ్‌పై మోహన్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మనోజ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని తెలియజేస్తూ రాచకొండ సీపీకి మోహన్ బాబు లేఖ రాశారు. తనకు రక్షణ కల్పించాలని రాచకొండ సీపీని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు మంచు మనోజ్ పహాడి షరీఫ్‌లో తనపై 10 మంది వ్యక్తులు దాడి చేశారని, విజయ్, కిరణ్ సీసీటీవీ ఫుటేజ్ తీసుకెళ్లారని.. తనకు ప్రాణహాని ఉన్న నేపథ్యంలో రక్షణ కల్పించాలని మనోజ్ పోలీసులను కోరాడు. ఈ వ్యవహారంలో ఇప్పటికే మంచు విష్ణు, మంచు లక్ష్మి కూడా ఎంట్రీ ఇవ్వగా.. మరి ఎలాంటి మలుపులు తిరుగుతుందనేది తెలియాల్సి ఉంది.

మోహన్ బాబు కుటుంబంలో ఆస్తి పంపకాలపై పెద్ద గొడవే జరుగుతుంది. తాజా పరిణామాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కానీ.. మోహన్ బాబు కుటుంబంలోని ఏ ఒక్కరూ మీడియా ముందు నోరు మెదపడం లేదు. జల్‌పల్లిలోని మోహన్ బాబు ఫాంహౌస్ కేంద్రంగా మంచు కుటుంబంలో కొట్లాట నడుస్తోంది. మంచు మనోజ్ గాయాలతో హాస్పిటల్‌కు వెళ్లడం, మనోకు వైద్యం చేసిన డాక్టర్లు గాయాలయ్యాయని పోలీసులకు సమాచారం ఇవ్వడం.. ఈ పరిణామాలు మంచు కుటుంబంలో విభేదాలు తలెత్తాయనే వార్తలకు బలం చేకూర్చాయి. ఆదివారం మాత్రమే కాదు సోమవారం ఉదయం నుంచి కూడా జల్‌పల్లి ఫాంహౌస్ కేంద్రంగా నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

## అవినీతి నుంచి అభివృద్ధి వైపు..



మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పక్కనపెట్టారని దుయ్యాబట్టారు. ప్రజా ప్రభుత్వంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని తమ సహచర మంత్రులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

**టీఎస్‌ను టీజీగా మార్చింది అందుకే..**

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఉన్న రోజుల్లో అందరం ‘టీజీ’ అని రాసుకున్నామని, వాహనాలు, కార్యాలయాల మీద కూడా అదే రాసుకున్నామని చెప్పారు. కానీ, గత ప్రభుత్వం మాత్రం ‘టీజీ’ అక్షరాలు కాదని, టీఎస్ అని పెట్టి ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని మండిపడ్డారు. రాష్ట్రంలోని 4 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ‘టీఎస్’ను ‘టీజీ’గా మార్చామని సీఎం రేవంత్ తెలిపారు. ఉద్యమ రోజుల్లో ఎక్కడ విన్నా.. ‘జయ జయహే తెలంగాణ’ గీతం వినిపించేదని.. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ గీతానికి గౌరవం దక్కలేదన్నారు. అందుకే మేం ‘జయజయహే తెలంగాణ’ను రాష్ట్ర గీతంగా ప్రకటించామన్నారు. పదేళ్లపాటు తెలంగాణ తల్లి వివక్షకు గురైందని.. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం వైపు నడిపిస్తున్నామన్నారు. ఎందరో కవులు, కళాకారులు ఉద్యమానికి వెన్నెముకగా నిలిచారు. తమ పాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉర్రూతలూగించారని.. వారిని గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.

**9 మంది కవులకు రూ.కోటి నజరానా...**

రాష్ట్ర పరిపాలనకు గుండెకాయ లాంటి సచివాలయంలో కవి అందెశ్రీని సన్మానించుకోవడం తనకు జీవితకాలం గుర్తుండే సందర్భమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఉద్యమ కాలంలో పలు రాజకీయ పార్టీలు తెలంగాణా తల్లికి వివిధ రూపాలు ఇచ్చారని.. కానీ ఇప్పటివరకు తెలంగాణ తల్లి రూపాన్ని అధికారికంగా ప్రకటించలేదన్నారు. అందుకే ప్రజా ప్రభుత్వం బహుజనుల తల్లి రూపమే తెలంగాణ తల్లి రూపంగా అధికారికంగా ప్రకటించిందన్నారు. తెలంగాణ తల్లిని చూస్తే కన్నతల్లి ప్రతిరూపంగా స్ఫురిస్తోందన్నారు. మొత్తం 9 మంది తెలంగాణ కవులు, కళాకారులకు తెలంగాణ ప్రభుత్వం నజరానా ప్రకటించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ, అమరవీరుల స్తూపం రూపశిల్పి ఎక్కా యాదగిరి, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, పాశం యాదగిరి, బండి యాదగిరి, గూడ అంజయ్య, గద్దర్, జయరాజ్ కుటుంబాలకు రూ.కోటి చొప్పున నగదు, 300 గజాల స్థలం బహుమానంగా ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు.

**తొలి ప్రకటన వచ్చింది ఈ రోజే: భట్టి విక్రమార్క**

డిసెంబర్ 9వ తేదీకి ఎంతో ప్రత్యేకత ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ఇస్తున్నట్లు కేంద్రం నుంచి తొలి ప్రకటన డిసెంబర్ 9నే వచ్చిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నామని, కానీ, ఆ ఆకాంక్షలు మాత్రం గత పదేళ్లు నెరవేరలేదని చెప్పారు. ప్రజలు తొమ్మిదిన్నరేళ్లు నిర్బంధాల మధ్య గడిపారని.. రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టి అతలాకుతలం చేశారని భట్టి తెలిపారు. భారీ అప్పుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని.. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించామని.. రైతు రుణమాఫీ కింద రూ.21వేల కోట్లు ఇచ్చామన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వాన్ని ఇచ్చారని.. భారీ అప్పుల్లో ఉన్నా.. సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. పదేళ్లపాటు విద్యార్థుల డైట్ ఛార్జీలను గత ప్రభుత్వం పెంచలేదని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డైట్ ఛార్జీలను ఒకేసారి 40శాతం పెంచామని.. గురుకులాలకు కూడా గత ప్రభుత్వం సరైన భవనాలు నిర్మించలేదని భట్టి అన్నారు.





విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం, 10.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## శాసనసభ ఈ నెల 16కు వాయిదా

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు వాయిదా పడ్డాయి. ఈనెల 16కు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం సభ ప్రారంభం కాగానే తెలంగాణ తల్లిపై ప్రకటన చేశారు సీఎం రేవంత్ రెడ్డి. అనంతరం మంత్రులు, సభ్యులు వారి అభిప్రాయాన్ని తెలియజేశారు. సాయంత్రం సచివాలయంలో తెలంగాణ తల్లి ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. అందరూ రావాలని అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. దీంతో సభలో కొద్దిసేపు సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. విగ్రహ నమూనాపై సభ్యులు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అధికారికంగా జరుపుకోవాలని సభ వేదికగా నిర్ణయించారు.

# సోనియా లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు

- డిసెంబర్ 9.. 4 కోట్ల ప్రజల కోరిక తీరిన రోజు
- విగ్రహావిష్కరణపై ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతం
- పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు ఏమీ రాలే
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్
- పాత విగ్రహానిది కవిత రూపం
- శాసనసభలో మంత్రి సీతక్క ఫైర్



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

సోనియా గాంధీ లేకుంటే మరో జన్మలో కూడా తెలంగాణ వచ్చేది కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం నాడు శాసనసభలో ఆయన మాట్లాడారు. ఇది తెలంగాణ రాష్ట్ర ప్రకటన రోజు.. నాలుగు కోట్ల ప్రజల కోరిక తీరిన రోజు అని అభివర్ణించారు. ఈ విషయాన్ని సభలో ప్రతిపక్ష నేత గతంలో స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజున ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. గత పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు ఏమీ రాలేదని చెప్పారు. అమ్మలాంటి తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకుంటున్న ఈరోజు.. సభకు వచ్చి శుభాకాంక్షలు చెప్పేది పోయి.. బయట నిరసనలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

**అది కేటీఆర్ చెల్లి రూపం: మంత్రి సీతక్క**


కేటీఆర్ మీ చెల్లి రూపం తెలంగాణ తల్లికి ఇచ్చావు. అదే రూపం తెలంగాణ ప్రజలపై రుద్దాలని చూశావు. నేడు తెలంగాణ సమాజం గర్వించే స్థాయిలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుంటే ఓర్వలేక కుల్లు రాజకీయాలకు తెర తీస్తున్నావు. ప్రజలన్నీ గమనిస్తున్నారు తెలుసుకో అంటూ మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. తెలంగాణ 4 కోట్ల ప్రజల ఆకాంక్ష అంటూనే, 60 సంవత్సరాల పోరాటాన్ని గుర్తు పెట్టుకొని తల్లి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని నాడు ప్రకటించారన్నారు. ఈరోజు పుట్టిన రోజు జరుపుకుంటున్న సోనియా గాంధీకి మంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణను బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ సొంత రాజకీయ అజెండాతో వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజల అస్తిత్వం, ఆత్మగౌరవం, పోరాటం, శ్రమైక జీవన రూపం, తల్లి ఆశీర్వాదం అన్ని కలగలిపిన నిండైన రూపం తెలంగాణ తల్లి రూపమన్నారు. అటువంటి తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడంపై యావత్ తెలంగాణ గర్విస్తుందన్నారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో పార్టీ జెండాలకు రూపం, రంగులు ఇచ్చుకున్నారే కానీ తెలంగాణ తల్లికి అధికారికంగా రూపం ప్రకటించలేదన్నారు. అది కూడా కేటీఆర్ తన చెల్లి రూపాన్ని విగ్రహ రూపమిచ్చి, తెలంగాణ తల్లి విగ్రహమని నాడు విస్తృత ప్రచారం చేశారని మంత్రి తెలిపారు.

**ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగానే విగ్రహ ఏర్పాటు: మంత్రి పొన్నం**

తెలంగాణ రావడానికి కారణం సోనియాగాంధీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ చిహ్నంలో మార్పు జరగలేదన్నారు. తెలంగాణ గీతాన్ని రూపొందించి అధికారికంగా ఉపయోగిస్తున్నట్లు వివరించారు. గతంలో ఉన్న విగ్రహాలు పార్టీకి సంబంధించినవని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం ప్రభుత్వపరంగా లేదని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తున్నామని.. రాష్ట్ర ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఇటీవల వరదలు వస్తే కేంద్రం కేవలం రూ.400 కోట్లు ఇచ్చిందని విమర్శించారు. కేంద్రం నుంచి నిధుల సాధనకు అందరం కృషి చేయాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# పాలకుర్తి నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్యానికి మహర్దశ

- తొర్రూరు ఆసుపత్రి లో 100 పడకలు ఏర్పాటు
- పాలకుర్తిలో ఆసుపత్రి లో 50 పడకలు ఏర్పాటు
- మంత్రికి ప్రజల బాధలు వివరించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
- సానుకులంగా స్పందించిన మంత్రి రాజనర్సింహ
- మంత్రికి కృతజ్ఞతులు తెలిపిన యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి



విశాలభారతి, పాలకుర్తి:

ఏండ్లుగా ఎదురుచూస్తూన్న ప్రజల మౌలిక సదుపాయాల ముఖ్యమైన వైద్యానికి నోచుకోక సరైన ఆసుపత్రులు లేకపోవడం, వున్న బెడ్ లు సరిపోక రోగులు పడుతూన్న యాతనా ను చూసి బెడ్లు దొరకక మహబూబాబాద్, వరంగల్ వైద్యానికి పోతున్నారు. గత పాలకులు తమకు ఏమి పట్టనట్టు వ్యవహరిస్తూ ఎన్నికల హడావుడి హామీ లు ఇచ్చి ఆచరణ లో శూన్యం చూపించిన, గత బీఆర్ ఎస్ నేతలు అదిగో తొర్రూరు కి 100పడకలు వచ్చింది అనేశారు కానీ నేటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంటే చూసి చలించి పోయినా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి , నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి వెంటనే ఆసుపత్రికి కావాల్సిన సదుపాయాలు కోసం సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నరసింహ గారిని కలిసి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలని వివరించారు. తమకు వెంటనే తొర్రూర్ 100 పడకల ఆసుపత్రిని పాలకుర్తి 50 పడకల ఆసుపత్రి కావాలని విజ్ఞప్తి చేయగా మంత్రి వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ వెంటనే పాలకుర్తి కి 50 పడకలు తొర్రూరు కి 100 పడకలు మంజూరు చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు..

**మాట తప్పిన బీఆర్ఎస్ పాలకులు..**

గత కొన్నేళ్లుగా నియోజకవర్గంలో ప్రజల సరైన వైద్యానికి నోచుకోక, ఆసుపత్రులు లేక నానా బాధలు పడుతున్నారు. వున్న ఆసుపత్రులలో బెడ్లు దొరకక, సరైన వైద్యం అందక మహబూబాబాద్, వరంగల్ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రజలు వైద్యం కోసం నానా కష్టాలు పడుతున్నా గత పాలకులు తమకు ఏమీపట్టనట్లు వ్యవహరించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి హడావుడి చేయడం తప్ప ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించలేకపోయారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో తొర్రూరులో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ.. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా వ్యవహరించారు.

# తెలంగాణ తల్లి కాదు... కాంగ్రెస్ తల్లి





మొదటిపేజీ తరువాయి

. తెలంగాణను మాయం చేయాలనే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రాజీవ్‌గాంధీ, తెలంగాణ తల్లి విగ్రహాలను గాంధీభవన్‌కు పంపిస్తామని.. మంగళవారం నుంచి తెలంగాణ తల్లి విగ్రహాలన్నింటికీ పాలాభిషేకం చేద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. దుండిగల్‌లోని మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ .. 15 ఏండ్ల క్రితం తెలంగాణ కోసం ఉక్కు సంకల్పంతో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ దీక్షకు దిగారని చెప్పారు. దీక్ష సఫలమైన ఈ రోజును విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామని చెప్పారు. తెలంగాణ సాధకుడిగా కేసీఆర్ పేరు చిరస్థాయిలో నిలిచిపోతుందన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహిగా మిగిలిపోవడం ఖాయమని పేర్కొన్నారు.

కాంగ్రెస్ రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమ కడలి మథనంలో తెలంగాణ తల్లి ఉద్భవించిందని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో భారత మాత విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని దాశరథి పొగిడారని చెప్పారు. దేవతా రూపంలో ఉన్న తల్లిని చిన్నగా చూపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పుట్టిన గడ్డను మాతృమూర్తిగా చూసుకునే సంస్కృతి తెలంగాణదన్నారు.

**దేవతా మూర్తిని పేదరాలిని చేశారు..**

కేసీఆర్ నాయకత్వంలో కవులు, కళాకారులు, శిల్పుల సారధ్యంలో సమిష్టిగా ఆవిర్భవించింది తెలంగాణ తల్లి అని కేటీఆర్ పేర్కొన్నారు. చూడగానే చెయ్యెత్తి దండం పెట్టేలా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ సంస్కృతిని అవమానించిన వారికి ధీటుగా సమాధానమిస్తాం అని తెలిపారు. తెలంగాణకు ప్రత్యేకంగా చేతిలో బతుకమ్మతో తెలంగాణ తల్లిని ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. అంత గొప్ప తల్లిని ఈనాడు కాంగ్రెస్ పార్టీ సర్కార్ పేదరాలిని చేసిందన్నారు. తల్లులను మార్చే దుర్మార్గులు ప్రపచంలో ఎక్కడా ఉండరని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాలు మారితే తలరాతలు మారాలి గానీ తల్లులు కాదన్నారు. తెలంగాణ తల్లిలో బతుకమ్మను మాయం చేయడం అంటే తెలంగాణ అస్తిత్వాన్ని మాయం చేయడమే అని అన్నారు.

**అపచారానికి బదులు తీర్చుకుంటాం..**

సమిష్టిగా సాధించిన తెలంగాణను పదేండ్లలో దేశంలోనే అగ్రపథాన నిలిపిన ఘనత కేసీఆర్‌దేనని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేసిన రోజే కాంగ్రెస్ తల్లిని సకల మర్యాదలతో గాంధీ భవన్'కు తరలిస్తామని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అపచారానికి ఖచ్చితంగా బదులు తీర్చుకుంటాం అని చెప్పారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ తల్లికి పాలాభిషేకాలు చేద్దాం అని పిలుపునిచ్చారు.

**బీఆర్ఎస్‌కు 90–100 సీట్లు ఖాయం..**

తెలంగాణలో శాసనసభ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా 90100 వంద సీట్లతో తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'నేను మీ అందరినీ ప్రార్థించేది ఒకటే.. ఈ సన్నాసులు ఎంత ప్రయత్నం చేసినా.. ఎంత బుకాయించే ప్రయత్నం చేసినా.. ఎన్ని రకాల పచ్చి అబద్ధాలను మార్కెట్ లో మార్కెటింగ్ చేసినా.. ఊరంతా హోర్డింగ్‌లు పెట్టి ఊదరగొట్టినా ఒకటి మాత్రం జరుగబోయేది పక్కా. రానున్న రోజుల్లో ఎన్నికలు శాసనసభకు ఎప్పుడు జరిగినా ఘంటాపథంగా చెబుతున్నా.. 90100 సీట్లతో తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం ఖాయం. నేను మీ అందరికీ మాట ఇస్తున్న. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన మొదటిరోజే.. మీరు మా తెలంగాణ తల్లి స్థానంలో పెట్టిన రాహుల్ గాంధీ తండ్రి విగ్రహాన్ని సకల మర్యాదలతో గాంధీ భవన్‌కు పంపడం ఖాయం' అన్నారు.




# చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడే

- తేల్చిచెప్పిన హైకోర్టు
- వేములవాడ మాజీ ఎమ్మెల్యేకు బిగ్ షాక్
- పౌరసత్వం కేసులో రమేశ్ పిటిషన్ కొట్టివేత
- తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించారని కోర్టు ఆగ్రహం
- చెన్నమనేనికి రూ. 30 లక్షలు ఫైన్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు తెలంగాణ హైకోర్టులో బిక్ షాక్ తగిలింగి. పౌరసత్వం కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టు ధర్మాసనం కొట్టేసింది. చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడే అని తీర్పు వెలువరించింది. ఆ దేశ పౌరుడిగా ఉంటూ ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తప్పుడు అఫిడవిట్లతో ఎమ్మెల్యేగా విజయం సాధించి.. తప్పుదోవ పట్టించినందుకు జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చెన్నమనేని పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ తీర్పు వెలువరించింది. దాంతో పాటుగా చెన్నమనేనికి రూ.30 లక్షల ఫైన్ విధించింది. ఆ మొత్తంలో ప్రస్తుత వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు రూ. 25 లక్షల చెల్లించాలని తీర్పు ఇచ్చింది. మరో రూ.5 లక్షలను లీగల్ సర్వీస్ అథారిటీకి నెలరోజుల్లో చెల్లించాలి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో పౌరసత్వం విషయంలో చెన్నమనేని ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది.

**అసలు వివాదం ఏంటి..?**

చెన్నమనేని రమేశ్ 1956 ఫిబ్రవరి 3న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జన్మించారు. రమేశ్ తండ్రి చెన్నమనేని రాజేశ్వరరావు ఉమ్మడి ఏపీలో సీపీఐ కీలక నాయకులు. పలు దఫాలు ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రమేశ్ బాబు అగ్రికల్చర్‌లో ఎమ్మెల్సీ పూర్తి చేశారు. 1987లో జర్మనీ హంబోల్ట్ యూనివర్శిటీ ఆఫ్ బెర్లిన్ నుంచి ఆయన పీహెచ్‌డీ పట్టా పొందారు. 1990లో జర్మనీకి వెళ్లి అక్కడే ఉద్యోగం చేసారు. ఈ క్రమంలో 1993లో రమేశ్‌కు జర్మనీ పౌరసత్వం వచ్చింది. 2008లో చెన్నమనేని రమేశ్ బాబు ఇండియాకు తిరిగి వచ్చారు. భారతీయ పౌరసత్వం కోసం తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఏడాది అంటే.. 2009 ఎన్నికల్లో ఆయన వేములవాడ అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆది శ్రీనివాస్‌పై 1821 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత రమేశ్ పౌరసత్వంపై ఆది శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అనంతరం 2010 ఉప ఎన్నికతో పాటు.. 2014, 2018 ఎన్నికల్లో కూడా రమేశ్ విజయం సాధించారు. రమేశ్‌పై కాంగ్రెస్ అభ్యర్థిగా ఆది శ్రీనివాస్ పోటీ చేసిన ప్రతిసారీ ఓటమి పాలయ్యారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రమేశ్‌కు టికెట్ నిరాకరించగా.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆది శ్రీనివాస్ గెలిచారు. కాగా, రమేశ్‌బాబు పౌరసత్వం విషయంలో 2009 నుంచి వివాదం నడుస్తూనే ఉంది. తాజాగా.. మరోసారి పిటిషన్ విచారణకు రాగా.. హైకోర్టు ఆయనకు షాక్ ఇచ్చేలా తీర్పు ఇచ్చింది. ఆయన జర్మనీ పౌరుడే అని తీర్పు ఇవ్వటంతో పాటు కోర్టును మోసగించినందుకు ఫైన్ కూడా విధించింది.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
10.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# ప్రజల ఆత్మగౌరవం దెబ్బతీసేలా తెలంగాణ తల్లి విగ్రహం

- విద్య,వైద్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందించాలి.
- పంతంగి వీరస్వామి గౌడ్.

సూర్యాపేట, విశాల భారతి



తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో ఏర్పాటుచేసిన తెలంగాణ తల్లి విగ్రహం నమూనా ఉందని తెలంగాణ జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సామాజిక తెలంగాణ ఉద్యమ కారులు సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షుడు సావిత్రి బాయి పూలే జాతీయ విశిష్ట సేవా అవార్డు గ్రహీత పంతంగి వీరస్వామి గౌడ్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా గత ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందిస్తే అందుకు భిన్నంగా ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల మనోభావాలకు విరుద్ధంగా తెలంగాణ తల్లి విగ్రహరూపు రేఖలను మార్చడం సరికాదన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన విగ్రహం సాధారణ మహిళ వలే ఉందన్నారు. తెలంగాణ తల్లి అంటే దేవత మూర్తి రూపం ఉట్టిపడేలా ఉండాలని అన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరాలోచించాలని కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, రైతులకు రుణమాఫీ, ప్రజలకు కావలసిన అన్ని సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# గ్రూప్ 2 పరీక్షల వాయిదా కుదరదు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయినందున వాయిదా వేయలేమని స్పష్టం చేసింది. డిసెంబర్ 16న రైల్వే పరీక్ష ఉందని, ఒకే రోజు గ్రూప్2, రైల్వే పరీక్షలు ఉన్నందున పరీక్షను వేరే తేదీకి మార్చాలని కోరుతూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే, గ్రూప్2 వాయిదా వేయడం వల్ల లక్షల మంది అభ్యర్థులు నష్టపోతారని టీజీపీఎస్సీ న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులంతా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలిపారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం పరీక్షను వాయిదా వేసేందుకు నిరాకరిస్తూ పిటిషన్లు కొట్టివేసింది.

# స్వరాష్ట్రాన్ని ప్రకటించిన సోనియా గాంధీ తెలంగాణ ప్రజల దేవత

ఆమనగల్లు, విశాల భారతి :



నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల స్వరాష్ట్ర ఆకాంక్షను సహకారం చేసిన ఘనత కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియా గాంధీకే దక్కిందని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీతా నర్సింహ్మా, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ , డిసిసి ఉపాధ్యక్షుడు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. కెసిఆర్ తెలంగాణ వ్యూహ కర్త మాత్రమేనని తెలంగాణ బిడ్డల ఆత్మ గోష చూసి సోనియా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించారని వారు పేర్కొన్నారు. అమనగల్లు పట్టణంలో సోమవారం కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ చౌక్ వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. సోనియా గాంధీ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. సోనియా, రాహుల్ , ఖార్గే ,రేవంత్ , కసిరెడ్డి ల అనుకూలంగా నినాదాలు చేశారు. పట్టణంలో పలుచోట్ల మొక్కలు నాటి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల కనుగుణంగా స్వరాష్ట్రాన్ని ప్రకటించిన సోనియా గాంధీ తెలంగాణ ప్రజల దేవత అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులంతా సమాయత్తం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ,యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గం అధ్యక్షుడు దళపతి గౌడ్ , మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, మాజీ ఎంపీపీ ధనుంజయ్య, పిఎంసి డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, నాయకులు కృష్ణ నాయక్, తల్లోజు రామకృష్ణ, అప్పం శ్రీను, కాలే మల్లయ్య, కండె సాయి, రాజశేఖర్ , వెంకట్ రెడ్డి ,పర్వతాలు, ఖలీల్,అలిమ్ , సురేష్ నాయక్ ,నాజర్, ఫరీద్, మహేష్, ఖాదర్ ఖాద్రి, బాబా, ,మైసయ్య, మస్నగిరి, రఫీ, షాబుద్దీన్, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.




# భార్యను హత్య చేసిన నిందితుడిని పట్టుకున్న పోలీసులు

బాల్కొండ, విశాల భారతి

పారారిలో ఉన్న నిందితుడిని బాల్కొండ పోలీసులు పట్టుకొని రిమాండ్ కి తరలించారు. ఆర్మూర్ సిఐ శ్రీధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర లోని బీల్కొని గ్రామం, బిలోలి తాలూకా నాందేడ్ జిల్లాకి చెందిన జంగా శివకళ, భర్త రాజు గంగారం, గత సంవత్సరన్నార కాలం నుండి బ్రతుకుతెరువు కోసం వీరు బాల్కొండ మండలం వన్నెల్ బి గ్రామంలో ఉంటూ వ్యవసాయ కూలీలుగా పని చేసుకుంటూ జీవిస్తున్నారు. శివకళ భర్త రాజు గంగారం కొంతకాలంగా మద్యానికి బానిసై రోజు తాగుతూ,శశికళతో గొడవ పడుతూ ఉండేవాడని,అదే విధంగా గత రాత్రి అనగా డిసెంబర్ 7, 8 మధ్య రాత్రి సమయంలో రాజు గంగారం తన భార్య శివకళను పదునైన ఆయుధంతో తలపై కొట్టడంతో ఆమె మృతి చెందింది. దాంతో భర్త రాజు గంగారం ఇంటి నుండి పారిపోయాడు. మృతురాలు తల్లి లింగం పిరాజీ రాధాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నిందితుడిని సోమవారం పట్టుకొని రిమాండ్ పంపినట్లు తెలిపారు. ఇందులో ఎస్సై నరేష్,పోలిస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

ధర్పల్లి, విశాల భారతి:

ధర్పల్లి మండల కేంద్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్ రాజ్ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణను ఇచ్చిన సోనియా గాంధీ జన్మదిన వేడుకలు మండల పార్టీ కార్యాలయంలో టపాకాయలు పేల్చి,స్వీట్లు పంచి, కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు కార్యకర్తలతో ఘనంగా జరిపామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో.. సొసైటీ చైర్మన్ చిన్నారెడ్డి, నాయకులు చెలిమెల నర్సయ్య,చెలిమెల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# తెలంగాణ సమాజం సోనియా గాంధీని మరవదు

- రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర రావు

సూర్యాపేట, విశాల భారతి

అఖిలభారత కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షురాలు, తెలంగాణ రాష్ట్ర ప్రదాత సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా పట్టణ అధ్యక్షులు అంజాద్ అలీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి భారీ కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంపిణీ చేసిన అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర రావు మాట్లాడారు. తెలంగాణ సమాజం సోనియా గాంధీ ని ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని, నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల చిరకాల కోరిక తీర్చి, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు భావితరాలకు తెలిపే విధంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం అయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ఉత్సవాలను ఒక పండుగ లాగా జరుపుకుంటుంటే, బిఆర్ఎస్ నాయకులకు కంటగింపుగా ఉందని అన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ కి కృతజ్ఞతలు తెలపకపోగా అసెంబ్లీ నుండి పారిపోయిన ప్రతిపక్షం తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరు అడ్డుపడినా రాష్ట్ర అభివృద్ధి కి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చకిలం రాజేశ్వర రావు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్,జిల్లా యువజన అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, పోలగాని బాలు గౌడ్, చంచల శ్రీనివాస్,కరుణాకర్ రెడ్డి,గండూరి రమేష్, రావుల రాంబాబు, పందిరి మల్లేష్,ఆలేటి మాణిక్యం, కరీం, తదితరులు పాల్గొన్నారు.



# సోనియాగాంధీ జన్మదినం
# తెలంగాణ ప్రజలకు ఒక పండుగ

- యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు బొడిగె చంద్రమౌళి

సైదాపూర్, విశాల భారతి

పెరుకపల్లిలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు బొడిగె చంద్రమౌళి మాట్లాడుతూ.. సోనియా గాంధీ జన్మదినం తెలంగాణ ప్రజలకు ఒక పండుగ అని అన్నారు. డిసెంబర్ 9, 2009లో తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మొదలైంది.. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని ఉక్కు సంకల్పంతో సోనియమ్మ మన ఆకాంక్షలు నెరవేర్చారు. తెలంగాణ తల్లి ఎలా ఉంటుందో మనం చూడలేదు కానీ, తెలంగాణ తల్లి సోనియమ్మ రూపంలో ఉంటుందని ఆ తల్లి మనకు భరోసా ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాశవేణి రవీందర్,పోతరాజు శ్రీనివాస్, కానుగంటి బిక్షపతి,ఈశ్వరయ్య,మండల జంపెయ్య, బత్తిని శ్రీనివాస్, లక్కర్స్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుంటే కఠినమైన చర్యలు

- ఎంపీడీవో బాలకృష్ణ

ధర్పల్లి, విశాల భారతి

ధర్పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో, మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ బాలకృష్ణ మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించాలని నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందేలా చూడాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించని పక్షంలో కఠినమైన చర్యలు తీసుకుంటామని ఏజెన్సీ నిర్వాహకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రమేష్,డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# సూర్యాపేట మండల
# అదనపు విద్యాధికారికి సన్మానం

సూర్యాపేట, విశాల భారతి

ఇటీవల సూర్యాపేట మండల అదనపు విద్యాధికారి గా బాధ్యతలు చేపట్టిన శేషగాని శ్రీనివాస్ గౌడ్ ను కవి గాయకుడు, భవిష్య విద్యాసంస్థల ఎకానమిక్ డీన్ కొంపెల్లి దశరథ సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బోకే శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులలో వెలుగులు నింపి ఆదర్శ ఉపాధ్యాయుడిగా నిలవడమే కాకుండా ప్రధానోపాధ్యాయుడిగా, గొప్ప పరిపాలన దక్షకుడుగా పదవికి వన్నె తెచ్చి నేడు మండల అదనపు విద్యాధికారి గా బాధ్యతలు చేపట్టడం సంతోషకరమన్నారు. తన తండ్రి, తాత శేష గాని లింగయ్య సైతం ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అదనపు విద్యాధికారి శేష గాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నాపై అభిమానంతో హైదరాబాదు నుంచి ప్రత్యేకంగా వచ్చి సన్మానించినందులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నోబుల్ హైస్కూల్ కరస్పాండెంట్, భవిష్య విద్యాసంస్థల జిల్లా బాధ్యులు నామాల గురుమూర్తి, తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మ) పట్టణ అధ్యక్షులు శేష గాని నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సోనియా గాంధీ జన్మదినం
# తెలంగాణ ప్రజలకు ఒక పండుగ

మునుగోడు విశాల భారతి

అఖిలభారత కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా మునుగోడు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణ యాదవ్ ఆధ్వరంలో సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కార్యాలయంలో కాంగ్రెస్ యువజన నాయకులతో కలిసి కేక్ కటింగ్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాల మణి మాట్లాడుతూ సోనియా గాంధీ జన్మదినం తెలంగాణ ప్రజలకు ఒక పండుగ అని అన్నారు. డిసెంబర్ 9, 2009లో తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మొదలైంది.. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని ఉక్కు సంకల్పంతో సోనియమ్మ మన ఆకాంక్షలు నెరవేర్చారు.. తెలంగాణ తల్లి ఎలా ఉంటుందో మనం చూడలేదు కానీ, తెలంగాణ తల్లి సోనియమ్మ రూపంలో ఉంటుందని ఆ తల్లి మనకు భరోసా ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మండల కాంగ్రెస్ అధ్యక్షులు సైదులు ,నియోజకవర్గ ఉపాధ్యక్షులు బోయపర్తి ప్రసాద్ ,నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మాధగోని నాగేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నక్క వెంకన్న ,యువజన కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లి పూర్ణ ,చండూరు యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లింగస్వామి, మునుగోడు మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాధగోని రిషి యువజన కాంగ్రెస్ నాయకులు బొల్లం మహేష్,వెంకన్న, దుబ్బ ప్రభాకర్,తీగల స్వామి,ఉడుత శ్రవణ్,ఆవుల నరేష్,గణేష్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు



# మాజీ సర్పంచ్ల ముందస్తు అరెస్టు

ఆమనగల్లు, విశాల భారతి:

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి రాష్ట్ర సర్పంచులసంఘం పిలుపునివ్వడంతో సోమవారం పోలీసులు మాజీ సర్పంచులను ముందస్తు అరెస్టు చేశారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహా రెడ్డి, చెల్లంపల్లి మాజీ సర్పంచ్ కృష్ణయ్య యాదవ, తదితర గ్రామ మాజీ సర్పంచ్లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. బిల్లులు చెల్లించాలని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం అన్యాయమన్నారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
10.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




### బతుకమ్మను మాయం చేశారు..కవిత

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ తల్లి రూపురేఖల్ని మార్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించడం దురదృష్టకరం అని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ దుశ్చర్యకు తెలంగాణ తల్లి కన్నీళ్ళు పెడుతుందని అన్నారు. ఉద్యమ తల్లిని నేడు కాంగ్రెస్ తల్లిగా మార్చారన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని రహదారిలో ఏర్పాటు చేసి... తెలంగాణ తల్లి అని చెబుతున్న విగ్రహాన్ని చెరసాలలో ఏర్పాటు చేస్తున్నారని.. కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నామని కవిత అన్నారు. కోట్లాది మంది తెలంగాణ బిడ్డల్లో స్ఫూర్తి నింపింది తెలంగాణ తల్లి రూపురేఖల్ని మార్చడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బతుకమ్మతో పువ్వులను పూజించే సంస్కృతి తెలంగాణలో తప్ప ప్రపంచంలో మరెక్కడా లేదన్నారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేశారని మండిపడ్డారు. బతుకమ్మను మాయం చేయడం దురదృష్టకరమన్నారు.



## ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు

- బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలో మునుగోడు నియోజకవర్గంలోని వివిధ మండలాల అధ్యక్షులు మరియు సంస్థాగత ఎన్నికల అధికారులతో కలిపి సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలోని ఏడు మండలాలు రెండు మున్సిపాలిటీలోని 307 పోలింగ్ బూతులలో బూత్ కమిటీల ఎన్నిక నిర్వహించాలని, బిజెపి కార్యకర్తలు క్రమశిక్షణ కలవారని, ఉత్సాహవంతులను, యువకులను బూత్ కమిటీ అధ్యక్షులుగా నియమించాలని అన్నారు.రాబోయే కాలంలో తెలంగాణలో బిజెపి జెండా ఎగురుతుందని, తెలంగాణ ప్రజలు రేవంత్ ప్రభుత్వం పై అసంతృప్తిగా ఉన్నారని,6 అబద్ధాలు 66 మోసాలతో కాలం వెళ్లబుచ్చుతున్నారని అని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా సంస్థగత ఎన్నికల అధికారి కట్ట సుధాకర్ రెడ్డి, నల్లగొండ జిల్లా బిజెపి అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, జక్కలి రాజు, జాయింట్ కన్వీనర్ కాసాల జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

- చైర్మన్ యాట గీతా

**ఆమనగల్లు, విశాల భారతి :** మార్కెట్ యార్డులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ యాట గీతా నరసింహ కోరారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కేంద్రం నిర్వాహకులకు ఆమె సూచించారు. ఆమనగల్లు మార్కెట్ యార్డులో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం గీతా నరసింహ సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాల నేపథ్యంలో తేమశాతం నుంచి కొంత మినహాయించాలని రైతులు ఈ సందర్భంగా ఆమెను కోరారు. చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది రైతులెవ్వరు అధైర్య పడవద్దు అని ఆమె సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని తెలిపారు. మార్కెట్ యార్డ్ లో రైతులకు మెరుగైన వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సూపర్వైజర్ రాజేశ్వరి, నాయకులు శ్రీధర్ రెడ్డి, కందే సాయి, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.





## సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేయాలి

**శాలిగౌరారం, విశాలభారతి:** సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు సంఘం నాయకులు వేముల నాగయ్య డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టుతున్న రిలే నిరాహార దీక్షలు శాలిగౌరారంలో సోమవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. శాలిగౌరారం ఎంపీడీఓ కార్యాలయం ముందు సోమవారం సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా నాయకులు నాగయ్య మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 10 వ తేదీన జిల్లా కలక్టర్ కార్యాలయం ను ముట్టడించి నిరవధిక సమ్మె చెప్పాడుతామని హెచ్చరించారు. ఈ దీక్షకు అన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతుగా నిలిచి సంఘీభావం ప్రకటించారు.ఈ కార్యక్రమం లో సిహెచ్ బిక్షమ్య, ఉయ్యాల లింగయ్య,సుజాత, బండారు పరమేష్,కొండ గీత,రేణుక నాగమణి, లలిత, లక్ష్మి, నర్మద, శోభ,తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చింది

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందాల సమరం రెడ్డి

**శాలిగౌరారం, విశాలభారతి:** మండల కేంద్రంలో ఏఐసిసి మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా3 నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందాల సమరం రెడ్డి మాట్లాడుతూ 60 ఏండ్ల తెలంగాణ ఆకాంక్షను సోనియగాంధీ నెరవేర్చిందని, తెలంగాణ రాష్ట్రంలో యావత్ ప్రజలందరి పోరాటాన్ని గుర్తు ఇచ్చి తెలంగాణ రాష్టాన్ని ఏర్పాటు చేసిన గొప్ప మనసు ఉన్న సోనియాగాంధీ కి తెలంగాణ ప్రజలు రుణపడి ఉంటారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తుందని ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసి ఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి,వైస్ చైర్మన్ చామల మహేందర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి గూని వెంకటయ్య, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండ పల్లి కొమరయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బోడ అరుణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంతియాజ్, చామల జైపాల్ రెడ్డి, నరికే నరసింహ, చింత ధనంజయ,జోగు శ్రీను, వడ్లకొండ పరమేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్, మండల అధ్యక్షులు బొల్లికొండ గణేష్, ఉపాధ్యక్షులు నూక కిషోర్, లోడంగి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**పినపాక, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, ఈ బయ్యారం క్రాస్ రోడ్ నందు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు, తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాథం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి ఆత్మ బలిదానాలను ఆపేందుకు ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీకి నష్టం కలుగుతుందని తెలిసి కూడా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత, తెలంగాణ తల్లి సోనియా గాంధీ అని అన్నారు. ప్రధానమంత్రి పదవి చేపట్టేందుకు సోనియా గాంధీ అవకాశం వచ్చిన దేశ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని తృణప్రాయంగా భావించాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ప్రజప్రతినిధులు, మండల నాయకులు యువజన నాయకులు మహిళా నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## మావోయిస్టుల రాష్ట్ర బంద్

- ములుగు ఏజెన్సీలో హై అలర్ట్
- పోలీసుల ముమ్మర తనిఖీలు

**వాజేడు, విశాలభారతి:** చతిస్గడ్ సరిహద్దు ప్రాంతమైన తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా ఏజెన్సీలో హై అలర్ట్ ప్రకటించారు. ఈనెల ములుగు జిల్లా ఎటురునాగారం మండలం చలపాక అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్ కౌంటర్ బూటకపు ఎన్ కౌంటర్ అంటూ లేక విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్ర బంద్ కు పిలుపునివ్వడంతో ములుగు ఏజెన్సీ ప్రాంతంలో హై అలర్ట్ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో వాజేడు వెంకటాపురం ఏటూరు నాగారం మంగపేట కన్నాయి గూడెం తదితర మండలాలలో వ్యాపార సంస్థలు మూసివేయడంతో మావోయిస్టులు తలపెట్టిన బంధు సంపూర్ణంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై సరిహద్దు ప్రాంతాలలో రహదారులపై పోలీసు బలగాలను మోహరింపచేసి ముమ్మర తానిఖీలు చేపడుతున్నారు. ఒకవైపు పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టడం మరోవైపు మావోయిస్టుల బందు కొనసాగుతున్న నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతంలో బయానక వాతావరణ ఏర్పడింది. పి ఎల్ ఎ వారోత్సవాలు జరగడం మరుసటి రోజు మావోయిస్టు బందుకు పిలుపునివ్వడంతో ఏ క్షణం ఏం జరుగుతుందోననే బయనక వాతావరణం ఏర్పడింది. చల్పాక ఎన్ కౌంటర్ తో భారీ ఎదురు దెబ్బకు లోనైన మావోయిస్టులు ఏ క్షణమైనా నెత్తుటి బాకీ తీర్చుకోవడానికి దృశ్చర్యకు పాల్పడతారని అనుమానాలు రేకెత్తుతున్నాయి ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతూ ముమ్మరంగా తనిఖీలు కొనసాగిస్తున్నారు.



## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**పినపాక, విశాలభారతి:** ఈ బయ్యారం క్రాస్ రోడ్ నందు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు, తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాథం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి ఆత్మ బలిదానాలను ఆపేందుకు ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీకి నష్టం కలుగుతుందని తెలిసి కూడా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత, తెలంగాణ తల్లి సోనియా గాంధీ అని అన్నారు. ప్రధానమంత్రి పదవి చేపట్టేందుకు సోనియా గాంధీ అవకాశం వచ్చిన దేశ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని తృణప్రాయంగా భావించాలని చెప్పారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండి ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నాము అని అన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజప్రతినిధులు, మండల నాయకులు యువజన నాయకులు మహిళా నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలి

- గంప వెంకటేష్ గుప్తా

**ఆమనగల్లు, విశాల భారతి :** ప్రతి ఒక్కరూ భక్తి భవాన్ని కలిగి ఉండాలని డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు, కడ్తాల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. సోమవారం కడ్తాల పట్టణంలోని శివాలయంలో అయ్యప్ప స్వామి ఇరుముడి పూజ వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేరళకు చెందిన చందర్ నాయర్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఇరుముడి పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కడ్తాల పట్టణమంతా అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. విజయ్ గురుస్వామి ఇరుముడు కట్టుకొని సన్నిధానం బయలుదేరారు. ఆయనతోపాటు మరో పదకొండు మంది అయ్యప్ప స్వాములు శబరిమల బయలుదేరి వెళ్లినట్టు స్వాములు తెలిపారు. గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములకు భిక్షను డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అనంతరం సన్నిధానం చేసే స్వాములకు గంప వెంకటేష్ గుప్తా శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఎల్గమల్ల సత్యం, భీం స్వామి, జగత్ రెడ్డి, శ్రీకాంత్, శేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన భగవద్గీత జయంతి వారోత్సవాలు

**సూర్యాపేట, విశాలభారతి** భగవద్గీత జయంతిని పురస్కరించుకొని దేవాలయాలుధార్మిక సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 9 నుండి 15 వరకు గీతా జయంతి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక కన్వీనర్ ఎన్. సి .హెచ్ వేణుగోపాలచార్యులు, కోకన్వీనర్లు నాగవెల్లి ప్రభాకర్ ,పర్వతం శ్రీధర్ కుమార్ లు ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సామూహిక భగవద్గీతా పారాయణం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నుండి శనివారం వరకు పట్టణంలోని అన్ని దేవాలయాలలో సామూహిక భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, అలాగే ముగింపుగా డిసెంబర్ 15న స్థానిక రవి మహల్ లో ప్రతి సంవత్సరం లాగానే వెయ్యి మంది భక్తులచే సామూహిక భగవద్గీత పారాయణం "సహస్రగళ గీతార్చన " కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమములో శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ జీయర్ స్వామి వారు పాల్గొని భక్తులకు తమ ఆధ్యాత్మిక ప్రవచనాన్ని అందజేస్తారని, కావున సూర్యాపేట పట్టణ,పరిసర గ్రామాల భక్తులు వందలాదిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి, ఆండాళ్ గోష్టి భక్తులు,ఐక్య వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
10.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ఆర్.కృష్ణయ్యకు జాక్‌పాట్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఆంధ్రప్రదేశ్ నుంచి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను రాజ్యసభకు పంపించేందుకు బీజేపీ అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు ఆయన పేరును ఖరారు చేస్తూ సోమవారం ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి ఆర్.కృష్ణయ్య వెళ్లారు. అక్కడ పార్టీ నేతల సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం మంగళవారం రోజు వేయనున్న నామినేషన్ పత్రాలపై పలు సంతకాలు చేశారు. కాగా, వైసీపీ హయాంలో ఆర్.కృష్ణయ్య రాజ్యసభకు ఎంపీగా వెళ్లారు. పదవీకాలం ఇంకా నాలుగేళ్లు ఉండగానే ఆయన రాజీమానా చేశారు.



## సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా రక్త దానం ఏర్పాటు

- పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి

బాల్కొండ, విశాల భారతి

స్వరాష్ట్ర కలను సాకారం చేసిన సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఎన్ఎస్యుఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు,రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ 60 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేసి నేటి తెలంగాణ అభివృద్ధి ప్రస్థానానికి కారణమైన సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న ఎన్ఎస్యుఐ నాయకులను మనస్ఫూర్తిగా అభినందించారు. రక్తదానం ఇవ్వడం అంటే ఆపదలో ఉన్న వారికి ప్రాణం ఇవ్వడమేనని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాకారం చేసిన సోనియా గాంధీకి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో గెలిపించి రుణం తీర్చుకున్నారని అన్నారు. ఆమె కలలను సహకారం చేస్తూ నేడు అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని తెలిపారు. ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణు రాజ్ మాట్లాడుతూ సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏ ఆశయంతో ఇచ్చారో ఆ ఆశయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే దాదాపు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిందని, నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదాన్ని సహకారం చేస్తూ తొలి ఏడాదిలోనే దాదాపు 50 వేల పైగా ప్రభుత్వ ఉద్యోగాలను నియమించడంతో పాటు అప్పుల ఊబిలో చిక్కుకున్న రాష్ట్రాన్ని గాడిలో పెడుతుందని, రైతుల, విద్యార్థుల, యువత, మహిళల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన కొనసాగుతుందని అన్నారు. రానున్న కాలంలో కూడా సోనియా గాంధీ కలలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పదంలో కొనసాగుతుందని తెలిపారు. అలాగే రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిషర్ డిపార్ట్మెంట్ చైర్మన్ శ్రీనివాస్,ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు వినయ్, కంటెస్టెంట్ కార్పొరేటర్ సాయిలు,మాజీ పార్లమెంటరీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పంచరెడ్డి చరణ్,జగడం సుమన్,శివ,ఉపాధ్యక్షుడు సాయికిరణ్,నిఖిల్ రెడ్డి,నరం దీప్, శశి, అఖిల్,గంగ ప్రసాద్,రాజు యాదవ్, పోచమగల్లి శివ,శశాంక్,కౌశిక్,ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.





## ఒకే పాఠశాలలో చదువుకున్నారు..

- 52 ఏళ్ల తరువాత ఒకే చోట కలుసుకున్నారు
- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పటాన్ చెరు,విశాలభారతి

పటాన్ చెరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 19711972 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. 52 ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో కలిసి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు ఒకే చోట చేరి ఆత్మీయతను పంచుకున్నారు. పటాన్ చెరు పట్టణంలోని ముదిరాజ్ భవనంలో మాజీ కార్పొరేటర్ ఎం.సపానదేవ్ నేతృత్వంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులతో పాటు చదువులు చెప్పిన నాటి గురువులు పెంటయ్య, శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులను కార్యక్రమానికి ఆహ్వానించి పూల మాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించి, తాము చదువుకున్న పాఠశాల తీపి కబుర్లు, తమ అనుబంధాలను స్మరించుకున్నారు. తమ వద్ద క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి నేడు ప్రభుత్వ, ప్రైవేటు, వ్యాపార, రాజకీయ రంగాలలో స్థిరపడిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించి, ఆశీర్వదించారు. నాటి తోటి విద్యార్థులు, గురువులు ఒకే వేదికపై కలిసి ఆప్యాయత చాటుకోవడం తనకు ఎంతగానో సంతోషాన్ని ఇచ్చిందని మాజీ కార్పొరేటర్ సపాన దేవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాణిక్ ప్రభు, బసవేశ్వర్, గోపాల్ రెడ్డి, విశ్వనాథం, ఎంజాల ముత్యం, తదితరులు పాల్గొన్నారు.



## సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

బాల్కొండ, విశాల భారతి

బాల్కొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వన్నెల్ బి ఎక్స్ రోడ్ వద్ద సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, టాపాసులు కలుస్తూ సంబరాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 60 ఏళ్ల ఆకాంక్షలను నిజం చేసి, నాలుగు కోట్ల ప్రజల ఆశలకు ప్రాణం పోసి, తెలంగాణ ప్రజల గుండెల్లో చిర స్థాయిగా సోనియాగాంధీ నిలిచారని అన్నారు.ఈ కార్యక్రమంలో బాల్కొండ మండల అధ్యక్షుడు వేంకటేష్ గౌడ్,నాయకులు అరవింద్,ప్రవీణ్ గౌడ్,సంజీవ్ గౌడ్, యూనిస్, గంగాధర్,ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రాన్ని ఇచ్చిన తల్లి సోనియా గాంధీ

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరోజు రాజశేఖర్
- జిల్లా ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి

నర్సింహులపేట, విశాలభారతి:

మండల కేంద్రము లో చౌరస్తాలో ఘనంగా సోనియాగాంధీ 79వ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యలో గ్రామ శాఖ అధ్యక్షులు కడుదుల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఉక్కు సంకల్పంతో 60 ఏళ్ల ఆకాంక్షను అనేక అమరవీరుల త్యాగాలను గుర్తించి. ఉద్యమకారుల పోరాటాన్ని సహకరిస్తూనే ప్రత్యేక రాష్ట్రం కోసం సహకరించారు రాజకీయ సోలాభం గురించి ఆలోచించకుండా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని బిల్లు ప్రవేశపెట్టిన సోనియాగాంధీ. ఆయురారోగ్యాలతో ఉండాలని హస్తం పార్టీ బలోపేతం కోసం ఆ భగవంతుడు మరింత బలం చేకూర్చాలని నేతలు కోరుకున్నారు. జై కాంగ్రెస్, జై సోనియా గాంధీ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి, మాట్లాడుతూ సంక్షేమే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ యాదవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు సతీష్ గౌడ్, బీసీ మైనారిటీ సెల్ అధ్యక్షులు మహబూబ్ ఖాన్, గుండగాని వెంకన్న గౌడ్, ధాశ్రు నాయక్, దప్పుకటి వెంకన్న, మండల కార్యదర్శి రామకృష్ణ, మల్లెల శ్రీనివాసరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్, మండల సీనియర్ నాయకులు అలువల శ్రీనివాస్, గుండాల బిక్షం, గౌనీ యాదగిరి, రమేష్, వెంకన్న, రఘు స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

అనంతగిరి, విశాలభారతి:

ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ 78వ జన్మదిన వేడుకలను సోమవారం మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు.రాజీవ్ గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాదే కోటేశ్వరరావు,మాజీ సర్పంచ్ డా. ముత్తినేని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్తినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సోనియాగాంధీ చొరవతో సాధ్యమైందన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, ఎన్ని రాజకీయ ప్రకంపనలు వచ్చినా అన్నింటినీ తట్టుకుని తెలంగాణ ప్రజలు, విద్యార్థులు, ఉద్యమకారుల దశాబ్దాల ఆకాంక్షలను నెరవేర్చిన దేవత సోనియాగాంధీదే అని కొనియాడారు.తల్లి సోనియమ్మ కృషితోనే అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్ర సాధనను సుసాధ్యం అయిందన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని తెలిసినా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. సోనియా మీద అభిమానంతోనే,ఆమె త్యాగాలను గుర్తించి ,తెలంగాణ ప్రజలు స్వరాష్ట్రాన్ని ఇచ్చారన్న గౌరవంతో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో అధికారం కట్టబెట్టారన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి కీట లక్ష్మీనారాయణ,ఆరెపూడి వెంకటేశ్వర్లు, మేకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వన్ నేషన్... వన్ ఎలక్షన్!

ఢిల్లీలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ని కలిసిన శివ కుమార్

కల్వకుర్తి, విశాల భారతి



వన్ నేషన్ వన్ ఎలక్షన్ తో దేశానికి ఎంతో మేలు చేకూరుతుందని కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద యూత్ అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. ఢిల్లీలో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఒక దేశం ఒక ఎలక్షన్ పై చర్చించినట్లు తెలిపారు. అందుకు బండి సంజయ్ ఒకటే దేశం ఒకటే ఎన్నికలు పై అంగీకారం తెలిపినట్లు శివకుమార్ చెప్పారు. దేశం మొత్తంలో వివిధ రాష్ట్రాల నుంచి సేవ రంగంలో కృషి చేస్తున్న యువత అంత కలిసి "సంవిధాన్ సపోర్ట్" అనే బృందంగా దేశం మొత్తం ఉన్న పార్లమెంట్ సభ్యులను పార్టీలకు అతీతంగా కలిసి ఈ కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. శివ కుమార్ వెంట ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సంవిధాన సపోర్ట్ సభ్యుడు మౌళి కిషోర్ ఉన్నారు.



## ఎన్.ఎం.కె ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ఆపాలి

సూర్యాపేట, విశాల భారతి

మోతే మండలం రావిపహాడ్ గ్రామంలో ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ జరుపకుండా నిర్మాణ పనులు చేస్తున్న ఎన్ఎంకె విత్తనాలు ఫ్యాక్టరీని నిర్మాణ పనులు ఆపకుంటే ఫాక్టరీని రైతులతో కలిసి ముట్టడిస్తామని పిడిఎస్యు రాష్ట్ర సహయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ హెచ్చరించారు. సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో ఎన్ఎంకె ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11నుండి జరిగే ప్రచార యాత్ర, సంతకాల సేకరణ గోడ పత్రికలను సోమవారం ఆత్మకూరు ఎస్ మండలం శెట్టిగూడెం గ్రామంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్యు రాష్ట్ర సహయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ మాట్లాడుతూ ఈ కంపెనీ నిర్మాణం పూర్తి అయితే భూమి, నీరు, వాయు కాలుష్యము అవుతాయని అన్నారు. దీని చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు చాలా అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అదే విధంగా పంట భూములు కూడా భూసారం తగ్గిపోయి బీడు భూములుగా ఏర్పడుతాయని అన్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోతయాన్నారు. అందుకే ప్రజలకు, రైతులకు నష్టం కలిగించే ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ చేస్తున్న ప్రచార యాత్ర, సంతకాల సేకరణ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకి నారాయణ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకట్ రెడ్డి, పానుగంటి మల్లారెడ్డి, శంకర్, శ్రీనివాస్ రెడ్డి,వీరయ్య, ఉపేందర్ రెడ్డి,కాకి పాపిరెడ్డి ,గజ్జి శంకర్, లింగారెడ్డి, సాయి, ఉత్తరమ్మ, సామ్రాజ్యం, లక్ష్మి, ముత్తయ్య,గంగయ్య, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ గ్రామస్థాయి క్రీడలు ప్రారంభం

పాలకీడు, విశాలభారతి:



సీఎం కప్ గ్రామస్థాయి క్రీడలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పాలకీడు నందు ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ కార్యక్రమంలో పాలకవీడు మండలపరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మి, పాలక వీడు తహసిల్దార్ కమలాకర్,మండల విద్యాశాఖాధికారి ఇంజమూరి కాటయ్య పాల్గొని ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించడమే కాక,శారీరక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. అదేవిదంగా తహసీల్దార్ కమలాకర్ మా`ట్లాడుతూ ప్రపంచ క్రీడలలో భారతదేశ ప్రాతినిధ్యం పెరగాలంటే గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలి అని అన్నారు.




## పిపిఈ కిట్లను అందజేసిన మున్సిపల్ చైర్మన్ ప్రేమలత

బాల్కొండ, విశాల భారతి

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా భీమ్‌గల్ పురపాలక కార్యాలయం దగ్గర పారిశుద్ధ కార్మికులకు పిపిఈ కిట్లను మున్సిపల్ చైర్ పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్ అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పని జరిగే ప్రదేశాల్లో తప్పనిసరిగా కిట్లను ధరించి పని చేయాలని, అలాగే తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.పారిశుద్ధ కార్మికుల సేవలను గుర్తించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వై.రామకృష్ణ, కౌన్సిలర్లు బోదిరె నర్సయ్య, సతీష్ గౌడ్,ధారావత్ లింగయ్య,మూత లత,సిహెచ్ గంగాధర్,మల్లెల రాజశ్రీ, షమీం బేగం,కోఆప్షన్ సభ్యులు పర్స నవీన్,అజ్మతుల్లా,నాయకులు మల్లెల ప్రసాద్,మేనేజర్ నరేందర్,ఇన్చార్జ్ ఆర్ఐ రాజేశ్వర్,జూనియర్ అసిస్టెంట్ నవీన్, ఇంచార్జ్ సానిటేషన్ ఇన్స్పెక్టర్ ఓంకార్, పల్లికొండ శ్రీధర్,వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది,పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
10.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ఢిల్లీ పర్యటనకు సీఎం రేవంత్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** డిసెంబర్ 11 నుంచి 13 వరకు మూడు రోజులపాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల పర్యటనకు వెళ్లనున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం.. తొలి రోజు రాజస్థాన్‌లోని జైపుర్ వెళ్లనున్న సీఎం.. తర్వాతి రెండు రోజుల పాటు దిల్లీలో పర్యటించనున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై వివిధ శాఖల మంత్రులు, అధికారులతో చర్చించనున్నారు. పార్టీ అధిష్ఠానంతోనూ సీఎం భేటీ అయ్యే అవకాశముంది. మరోవైపు అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16 వరకు వాయిదా పడిన నేపథ్యంలో.. పీసీసీ అధ్యక్షుడు, ఇతర ముఖ్యనేతలు కూడా సీఎంతో పాటు దిల్లీ వెళ్లే అవకాశముంది. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై పార్టీ హైకమాండ్‌తో చర్చించే అవకాశముంది.

## హాస్టల్ విద్యార్థుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదే

బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులు చదువుకుంటున్నా సంక్షేమ వసతి గృహాలు సంక్షోభం లో కూరకపోయి ఉన్నాయి. హాస్టల్ లలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ లలో ఆహారం సరిగ్గా లేకపోవడంతో అనేక మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కారణంగా చనిపోయిన పరిస్థితి నెలకొంది. సంక్షేమ హాస్టల్లో నైట్ వాచ్మెన్ లేక విద్యార్థుల కు భద్రత కరువైంది. రాత్రి సమయంలో విద్యార్థులు అనుకోకుండా అనారోగ్య బారిన పడిన వారు బయటికి వెళ్ళలేని పరిస్థితి. అనేక సందర్భాలలో చనిపోయే పరిస్థితులు కూడా అనేకం. ప్రభుత్వం విద్యార్థులకి కావలసిన సౌకర్యాలు కల్పించలేకపోవడంతో విద్యార్థుల సంక్షేమ హాస్టల్లో సౌకర్యాలు సరిగా లేక హాస్టల్లో చేరాలనుకున్న విద్యార్థులు భయపడుతున్నారు. దీని మూలంగా దూరపు ప్రాంతాల విద్యార్థులు ఉన్నత చదువుకు దూరం అవుతున్నారు. గత ప్రభుత్వం విద్యార్థుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు ఇవ్వకుండా కార్పొరేట్ వాళ్లకు కొమ్ము కాస్తూ పేద విద్యార్థులు చదువుకుంటున్న సంక్షేమ హాస్టల్ లను గాలికి వదిలేసిన పరిస్థితి గతం ప్రభుత్వం చేసినది. ఈ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కూడా సంవత్సరం కావస్తున్న అయినప్పటికీ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నది. హాస్టల్లో పరిశుభ్రంగా లేకపోవడం, కావాల్సిన మౌలిక సదుపాయాలు లేకపోవడం ఉదయం మిగిలిన భోజనం సాయంత్రం పెట్టడం మూలంగా విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారు . అదేవిధంగా అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నది. ఈ సంవత్సరంలో 886 మంది విద్యార్థులుకు ఫుడ్ పాయిజన్ అయి 48 మంది విద్యార్థులు చనిపోయారు. విద్యార్థుల పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు గా వ్యవహరిస్తున్నది. తక్షణమే విద్యార్థుల్ని ఆదుకోవాలి. సంక్షేమ హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి, ఉదయం, సాయంత్రం మెనూ ప్రకారం విద్యార్థులకు టైం కి అందించాలి. గత కొన్ని రోజులుగా సంక్షేమ హాస్టల్లో గురుకుల హాస్టల్ లలో ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థులు అనారోగ్య బారిన పడి చనిపోవడం మూలంగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక అధికారులకు సంక్షేమ హాస్టల్లో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కానీ అధికారులు మాత్రం నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. తనిఖీలు నిర్వహించాలనుకునే వాళ్ళు అకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తారు కానీ ఈ అధికారులు మాత్రం ముందు సమాచారం ఇచ్చి తనిఖీలు నిర్వహించడంతో హాస్టల్ లలో సరిపడా సరుకులు పరిశుభ్రకరమైన వాతావరణం వంటలు చేసి చూపిస్తున్నారు .కానీ ఆ విధానం ప్రతిరోజు జరగటం లేదు. అధికారులు వచ్చిన రోజు మాత్రమే నామమాత్రంగా ఆరోగ్యకరమైన రుచికరమైన వంటలు వండి పెడుతున్నారు. విద్యార్థుల పట్ల సంక్షేమ గురుకుల హాస్టల్ అధికారులకు ప్రేమ లేదు. కనీసం వారిపట్ల శ్రద్ధ కూడా వహించే పరిస్థితి లేదు. ప్రతిరోజు హాస్టల్ విద్యార్థులకు అందుబాటులో ఉండాల్సిన వసతి గృహ అధికారులు మాత్రం చుట్టం చూపుగా వచ్చి పోతున్నారు తప్ప అందుబాటులో ఉండటం లేదు. దీని మూలంగా విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. హాస్టల్ లలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచామని పేపర్లలో, హాస్టల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేసారు తప్ప ఆచరణలో మాత్రం చార్జీలు పెంచలేదు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల విద్యార్థులు నివసిస్తున్న సంక్షేమ హాస్టల్ లలో పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి వెంటనే అమలు చేయాలి.రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్ లకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.ఆ భవనాలకు కూడా అద్దె చెల్లించని పరిస్థితి.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించి విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాలు అందించి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని,హాస్టల్ విద్యార్థుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వమే.



పిడమర్తి భరత్
పి.డి.ఎస్.యు




## సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం

- గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం
- పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని బాటసింగారం పండ్ల మార్కెట్ లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు దశాబ్దాల ఆకాంక్ష, నాలుగు కోట్ల ప్రజల చిరకాల స్వప్నం తెలంగాణ రాష్ట్ర సాకారం చేసిన తెలంగాణ తల్లి గా సోనియా గాంధీ కి తెలంగాణ రాష్ట్రం ఋణపడి ఉంటుందన్నారు. సోనియాగాంధి జన్మదినం సందర్భంగా మలక్ పేట యశోద హాస్పటల్స్ సహకారంతో బాటసింగారం పండ్ల మార్కెట్ లో పలు రంగాలలో అనుభవమైన వైద్యులచే ఉచిత మెగా వైద్య శిబిరం ని ఏర్పాటు చేయడం జరిగిందనీ చెప్పారు. హమాలీలు,రైతులు,వర్తకులు,మార్కెట్ సిబ్బంది,పాలకవర్గం అందరూ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అమరుల త్యాగాలను చూసి చలించి అప్పటి కాంగ్రేస్ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రం ఇచ్చి తెలంగాణ కలను సాకారం చేసిందని అన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం గడిచిన సందర్భంగా రైతులకు అనేక రకాల ప్రోత్సాహకాలను అందించిన ఘనత మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ వైస్ చైర్మన్ బాస్కర చారి, డైరెక్టర్లు , అధికారులు పాల్గొన్నారు..



## గుండ్రాతి మడుగులో ఘనంగా శివా మహా పడిపూజ

- సతీష్ స్వామి ఆచార్యులు

**కురవి విశాలభారతి:** గుండ్రాతి మడుగు గ్రామంలో శివయ్య స్వామి సతీష్ఆచార్యులు శివ స్వామి మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. శివయ్య స్వామి దీవెనలు ఉండాలని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సతీష్ స్వామి శివయ్య స్వామికి వారికి పంచామృతాలు వివిధ పనులు గంధం విభూతి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు మంత్రోక్తంగా తంత్రిక విధానంలో స్వామి వారి చరిత్ర పడిపూజ పాటల భజన పాటలతో ఉత్సవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ స్వామి ఆచార్యులు మాట్లాడుతూ ప్రతి యేడు లక్షలాదిమంది స్వాములు మాల ధారణ చేసుకొని 41 రోజులు కఠిన దీక్ష నియమాలు పాటిస్తూ స్వాములు అనుగ్రహం కు పాత్రులు అవుతున్నారని అన్నారు. ఈ పడిపూజ కార్యక్రమంలో కృష్ణ ఉదయ్, భాస్కర్, గురు స్వామి రమేష్, లక్ష్మణ్ స్వామి, సక్రు స్వామి, నరేష్ స్వామి, ప్రసాద్ స్వామి, బాలాజీ స్వామి, వీరన్న స్వామి, కిరణ్ స్వామి, లింగన్న స్వామి, తదితర స్వాములు పాల్గొన్నారు.



## ఇన్సూరెన్స్ చెక్కును అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

**అడవిదేవులపల్లి, విశాలభారతి:** మండల పరిదిలోని ఉల్సాయిపాలెం గ్రామం బంగారిగడ్డ చెందిన బిఆర్ఎస్ కార్యకర్త కేతావత్ హాతీరాం, ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారికి బి.ఆర్.ఎస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉండడం వల్ల వారికీ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు చొరవతో మంజూరు అయిన బి.ఆర్.ఎస్ పార్టీ ప్రమాద భీమా 2 లక్షల రూపాయల విలువగల చెక్కును స్థానిక రెడ్డికాలనీలో గల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈరోజు వారి కుటుంబీకులకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బి.ఆర్.ఎస్ పార్టీ సభ్యత్వం కల్గివున్న ప్రతి కార్యకర్తకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించిందని పార్టీ కార్యకర్తలు ప్రమాదవశాత్తు చనిపోతే వారి కుటుంబ సభ్యులకు అండగా నిలిచేందుకు ఈ ప్రమాద భీమా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా వైస్ ఛైర్మన్ దుర్గంపూడి నారాయణ రెడ్డి, తాజా మాజీ ఎంపిపి ధనావత్ బాలాజీ నాయక్, తాజా మాజీ జెడ్పీటీసీ అంగోతు లలిత హాతీరాం నాయక్, నాయకులు ధనావత్ లచ్చీరామ్ నాయక్, పకీర నాయక్, స్వామి నాయక్, లకుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె

**పాలకీడు, విశాలభారతి:** మండలంలోని మండల వనరుల కేంద్రం వద్ద ఎస్ఎస్ఏ సిబ్బంది ఐక్యంగా నిరసనకు దిగినారు. మాకు కనీస వేతనము (ఎంటీసి ) మినిమం టైం స్కేల్ ,ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుచున్నాము. గత ఇరవై సంవత్సరాలుగా అతి తక్కువ వేతనముతో ప్రభుత్వము శ్రమదోపిడికి పాల్పడుతుందని, ఆవేదన వ్యక్తపరచడం జరిగింది. అందుకు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండలంలోని ఎస్ఎస్ఏ సభ్యులందరూ రేపటి నుండి నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నాము. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ మండల అధ్యక్షుడు బండావత్ మంగ్త నాయక్ , ప్రధాన కార్యదర్శి బి. కరుణాబాయి, ఉపాధ్యక్షు రాలు కే స్రవంతి, కోశాధికారి ఎస్ వెంకటేశ్వర్లు కేజీబీఐ స్పెషల్ ఆఫీసర్ (ఎస్.ఓ ) బి. సుజాత, సిఆర్పి రాథోడ్ పాల్గొన్నారు.



## నాన్ టీచింగ్ వర్కర్స్ వేతనాలను రూ.26 వేలకు పెంచాలి

- ఐఎఫ్టియు డిమాండ్

**నూతనకల్, విశాలభారతి:** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ నాన్ టీచింగ్ వర్కర్స్ కి కనీస వేతనాలను 26 వేల రూపాయలకు పెంచాలని తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీపీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గంట నాగయ్య అన్నారు. నూతనకల్ మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ పాఠశాల గేట్ ముందు నాన్ టీచింగ్ వర్కర్స్ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గంట నాగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అవుతున్న నేటి వరకు కస్తూర్బా గాంధీ విద్యాలయాల లో పనిచేస్తున్న శ్రామిక మహిళల వేతనాల పెంపుదల గురించి ఆలోచన చేయడం లేదని , కనీస వేతనం 26 వేల రూపాయలకు పెంచాలని అన్నారు. సంవత్సరాల తరబడి పనిచేస్తున్న గుర్తింపు లేదని, ఉద్యోగ భద్రత లేదని, సమాన పనికి సమాన వేతనం అందడం లేదని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేవని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానంతో ఈ విద్యాలయాల్లో మహిళలు వెట్టిచాకిరి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, సునంద, మల్లికాంబ, కవిత తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై సీఎం స్పందించాలి

- రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి



**సూర్యాపేట, విశాల భారతి** సీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన వైఖరిని వెల్లడించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరి సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారదులుగా నడుస్తున్న జర్నలిస్టుల సమస్యలు అసెంబ్లీలో చర్చించే ప్రధాన సమస్యలో ఒకటిగా భావించి అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, ప్రతిపక్ష పార్టీ ప్రజా ప్రతినిధులు చర్చ జరపాలని కోరారు. ఎన్నికల్లో జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను మర్చిపోకుండా ప్రతి జర్నలిస్టు కుటుంబానికి పక్కా ఇండ్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని యాదగిరి కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ ప్రెస్ క్లబ్ భవనాలు లేక జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో ఆ ప్రాంతాలను గుర్తించి వెంటనే అన్ని సౌకర్యాలతో కూడిన ప్రెస్ క్లబ్ భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలకు కొమ్ము కాసే కొన్ని మీడియా సంస్థల వ్యవహార శైలితోనే ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలపై పట్టి పట్టనట్టుగా సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నాయని ఆరోపించారు. వర్కింగ్ లో ఉన్న ప్రతి జర్నలిస్టుకు వెంటనే అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేయాలని ఒక యూనియన్ జర్నలిస్టులకు మాత్రమే న్యాయం చేసే విధంగా ప్రెస్ అకాడమీ నిర్ణయాలు తీసుకోకుండా రాష్ట్ర వ్యాప్తంగా వర్కింగ్ లో ఉన్న సుమారు 30 వేల మంది జర్నలిస్టుల కుటుంబాలకు లబ్ధి చేకూరేలా నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు.



## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**నూతనకల్, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ అధినేత్రి శ్రీమతి సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నూతనకల్ మండల యువజన కాంగ్రెస్ అద్యక్షులు పసుల అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా తీగల గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ 22 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అద్యక్షురాలుగా ఉండి,ప్రదానమంత్రి పదవిని సైతం త్యాగం చేసిన మహా వ్యక్తి, 60 ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ధన్యురాలని, దానికి గుర్తుగా తెలంగాణ ప్రజలు దేశానికి ప్రధానిగా రాహుల్ గాంధీనీ చేసి వారి ఋణం తీర్చుకోవాలని కోరారు.జిల్లా కాంగ్రెస్ నాయకులు కట్ట మల్లారెడ్డి, మెంచు చక్రయ్య, దరిపెల్లి వీరన్న, మరాఠి రామస్వామి,బద్దం వేంకట రెడ్డి,మహమూద్, విద్యాసాగర్,లావుడ్యా శ్రీధర్, గ్రామ శాఖ అద్యక్షులు బొడ్డుపల్లి అంజయ్య, సోషల్ మీడియా కోఆర్డీనేటర్ బొల్క సైదులు యాదవ్ ,లింగాల రామచంద్రయ్య తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

vishalabharathi Telugu Daily

విశాల భారతి

తెలుగు దిన పత్రిక

మంగళవారం,
10.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





## పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ

**మహేశ్వరం-విశాల భారతి :**

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ 31వ డివిజన్ గ్రీన్ రిచ్ కాలనిలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన విజయోత్సవ వేడుకలో పాల్గొన్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి,అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రధాత శ్రీమతి సోనియా గాంధీ గారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఉన్న తెలంగాణ కోరికను సహకారం చేసిన శ్రీమతి సోనియా గాంధీ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా సంవత్సర కాలం పూర్తి చేసుకున్న కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పక్షపాతి అని పేదల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజల అభ్యున్నతికి సంవత్సర కాలంలో దశలవారీగా మేనిఫెస్టో అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి సహకరిస్తున్న మంత్రులకి కృతజ్ఞతలతో పాటు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు జెల్లా రమేశ్ గౌడ్, బోయపల్లి రాఘవేంద్ర రెడ్డి ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు పన్నాల రాజేందర్ రెడ్డి, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, గంగుల ప్రభాకర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నరహరి గౌడ్, మనోహర్, ఉమేశ్, శ్యామ్ సుందర్ రెడ్డి, రమాకాంత్, కొండ శ్రవణ్ కుమార్ యాదవ్, గిరి ముదిరాజ్ మరియు కాలనీల అధ్యక్షులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్యను తీర్చాలని అధికారులను వేడుకున్న గ్రామస్తులు



**బాల్కొండ, విశాల భారతి**

మంచినీటి సమస్యను తీర్చాలని గ్రామపంచాయతీ అధికారులను గ్రామస్తులు వేడుకున్నారు. భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన మాదిగ కాలనీ వాసులకు మంచినీటి సరఫరా దాదాపు గత ఐదు రోజులు నుండి నిలిచిపోవడంతో ఇబ్బందిగా ఉందని అన్నారు.ఎలాగైనా మంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బాధతో కాలనీ వాసులు గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర అధికారులను వేడుకున్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- **అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన**
- **ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 52 ఫిర్యాదులు**
- **రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆదిభట్ల మున్సిపాలిటీలోని సమీకృత జిల్లా కార్యాలయాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 52 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ 45, ఇతర శాఖలకు 07 వచ్చాయని మొత్తం 52 దరఖాస్తులు అందాయనీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫైల్స్ పెండింగ్ పెట్టకుండా నిబంధనల ప్రకారం పనుల చేయాలని అన్నారు. పెండింగు పనులను ముందుగా పరిష్కరించాలని, కింది స్థాయిలో శాఖ పని తీరును పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేసి పనులు పెండింగులోలేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు.



## నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **రూ.2 లక్షల 50 వేల ఎల్ఓసి అందజేత**

**పటాన్ చెరు,విశాలభారతి**

ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జెపి కాలనీకి చెందిన గంగాధర్ రెడ్డి కుమారుడు సాయి కిరణ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మెరుగైన చికిత్స కోసం స్థానిక ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. బాలుడు చికిత్స కోసం మంజూరైన 2 లక్షల 50వేల రూపాయల విలువైన ఎల్ఓసి అనుమతి పత్రాన్ని సోమవారం ఎమ్మెల్యే జిఎంఆర్ బాలుడు తండ్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, దేవానంద్, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు అంతిరెడ్డి, భాస్కర్ గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సోనియా గాంధీ 78 వ జన్మదిన వేడుకలు

**అడవిదేవులపల్లి, విశాలభారతి:**

మండల కేంద్రంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) పిలుపుమేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ అధినేత్రి ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు తెలంగాణ ఇచ్చిన తల్లి శ్రీమతి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించి సోనియా గాంధీ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జడ్.పి.హెచ్.ఎస్ హై స్కూల్ కేజీబీవీ విద్యాలయంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. అనంతరం మండల కాంగ్రెస్ నాయకులు బండి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల తెలంగాణ కల సహకారం చేసినటువంటి తల్లి సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు మండల కేంద్రంలో జరుపుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందని దేశ ప్రజలందరి, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరి ఆశీస్సులతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో డైరెక్టర్లు పెద్దింటి రామ్మూర్తి, కోరబోయిన రామయ్య, నాయకులు పేర్ల గంగరాజు, పిల్లి చిరంజీవి, శీలం వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




## "సీఎం కప్ " తో క్రీడాకారుల ప్రతిభ వెలికితీత

- **మూడు రోజుల పాటు మండల స్థాయిలో క్రీడాపోటీలు**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

గ్రామీణ స్థాయి క్రీడాకారులు ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కప్ దోహదపడుతుందని సీఎం కప్ యాచారం మండల ఇన్చార్జ్ , పీడి మల్లేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ యాచారం మండల స్థాయిలో నేడు , రేపు ,ఎల్లుండి మూడు రోజుల పాటుగా వాలీబాల్ , కబడ్డీ ,ఖోఖో ఆటలు ఆడించబడుతుందని తెలిపారు. టీమ్ వచ్చిన సమయం ఆధారంగా టోర్నీ ఎంపిక జరుగుతుందన్నారు. యాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణం లో పిడీ, పీఈటి లు రిపోర్టు చేయాలనీ కోరారు.

## లింగోటం గ్రామంలో మహా పడిపూజ

**చౌటుప్పల్, విశాలభారతి:**

శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈనెల 19న లింగోటం గ్రామంలో పల్స రమేష్ గౌడ్ గురు స్వామి 18 వ శబరి మల యాత్ర సందర్భంగా మహా పడిపూజ కార్యక్రమం పూజ్య గురు స్వాములు శ్రీ సత్య ప్రియ గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహిస్తున్న సందర్భంగా ఈరోజు మన దేవాలయంలో గురుస్వాముల సమక్షంలో కరపత్రిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తూర్పాటి శంకర్ గురుస్వామి, కామిశెట్టి భాస్కర్ గురు స్వామి, ఉప్పు ఆంజనేయులు గురు స్వామి, అంతటి రాము గౌడ్ గురు స్వామి, చింతలసాయిలు గురుస్వామి, బోరేమ్ రాజశేఖర్రెడ్డి గురుస్వామి, సుదర్శన్ స్వామి, లింగోటం గురు స్వాములు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



## 'పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్'

**తుర్కయంజాల్, విశాలభారతి:**

సీఎం సహాయనిధి పథకం పేదలకు వరంగా మారిందని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తుర్కయంజాల్ మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 20 వార్డులకు చెందిన 13 మంది లబ్దిదారులకు రూ.4.67లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అనురాధ రాంరెడ్డి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న కార్పొరేట్ వైద్యం అందించడమే ముఖ్యమంత్రి సహాయనిధి ఉద్దేశమన్నారు. కాంగ్రెస్ సర్కార్ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేసేందుకు నాయకులు, కార్యర్తలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కుంట ఉదయశ్రీ గోపాల్‌రెడ్డి, మర్రి మాధవి మహేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సామ భీంరెడ్డి, రేవల్లె యాదగిరి, పుల్లగుర్రం విజయానంద్‌రెడ్డి, చెరుకు బాల శివుడు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## తెలంగాణ ప్రజల కలను నిజం చేసిన మహా నేత సోనియా గాంధీ

- **కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్**
- **ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు**

**పటాన్ చెరు,విశాలభారతి**

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్షను నెరవేర్చిన మహా నాయకురాలు సోనియా గాంధీ అని పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రామచంద్రాపురం పరిధిలోని కాట శ్రీనివాస్ గౌడ్ నివాసంలో సోమవారం సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తన సతీమణి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సుధారాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన దేవత సోనియా గాంధీ అని కొనియాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్, అమీన్ పూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మన్నె రవీందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జానపహాడ్ దర్గాలో కాంగ్రెస్ నేతల ప్రత్యేక పూజలు

**పాలకీడు విశాలభారతి:**



కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా పాలకీడు మండల కాంగ్రెస్ పార్టీ నేతలు జానపహాడ్ దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. తమ నాయకురాలు ఆరోగ్యంగా మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కేకు కట్ చేసి జై సోనియమ్మ అని నినాదించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా నాయకులు మోతిలాల్, గోపాల్ నాయక్, నరసింహారావు, మహిళా నాయకురాలు జ్యోతి ఉన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా

మంగళవారం,
10.12.2024
హైదరాబాద్



cinema updates



## రూ.829 కోట్ల వసూళ్లతో ఇండియన్ సినీ చరిత్రలో సరికొత్త రికార్డు!

ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, బ్రిలియంట్ దర్శకుడు సుకుమార్‌ల పుష్ప-2 ది రూల్.. చిత్రం ఇండియన్ బాక్సాఫీస్‌పై సరికొత్త రికార్డులను క్రియేట్ చేస్తోంది. ఈ సన్సేషన్ కాంబినేషన్‌లో అత్యున్నత నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ సుకుమార్ రైటింగ్ సంస్థతో కలిసి ఈ ఇండియన్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ సినిమాను నిర్మించింది. విడుదలకు ముందే ప్రీరిలీజ్ బిజినెస్‌లో ఇండియాలో సరికొత్త రికార్డును నెలకొల్పిన ఈ చిత్రం సినిమా విడుదల రోజు ప్రీమియర్‌స్ నుంచే సన్సేషనల్ బ్లాకబస్టర్ అందుకుంది. అల్లు అర్జున్ నట విశ్వరూపంకు, సుకుమార్ వరల్డ్ క్లాస్ టేకింగ్.. ప్రపంచ సినీ ప్రేమికులు ఫిదా అయిపోయారు. ముఖ్యంగా ఇండియాలో ఈ చిత్రం సృష్టించిన రికార్డుల పరంపరకు ఆకాశమే హద్దుగా ఉంది. సినిమా తొలి రోజు నుంచే మొదటి రోజు, రెండవ రోజు, మూడవ రోజు వసూళ్లలో వరుసగా ఇండియా ఆల్‌టైమ్ రికార్డులు సృష్టించిన ఈ చిత్రం తాజాగా నాలుగు రోజు వసూళ్లలో కూడా రూ. 829 కోట్లు వసూలు చేసి ఇండియా చరిత్రలో ఆల్‌టైమ్ రికార్డు సృష్థించింది. కేవలం నాలుగు రోజుల్లోనే రూ.829 కోట్లు వసూలు చేసిన తొలి భారతీయ చిత్రంగా 'పుష్ప-2' ది రూల్ బాక్సాఫీస్‌పై సరికొత్త అధ్యాయాన్ని క్రియేట్ చేసింది. ప్రతి భాషలో సునామీలా దూసుకపోతున్న పుష్ప-2 ముఖ్యంగా బాలీవుడ్‌లో తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. బాలీవుడ్‌లో నాలుగో రోజు ఒక్క రోజులోనే రూ.86 కోట్లు వసూలు చేసి సరికొత్త సంచలనానికి తెరలేపింది. ఇప్పటి వరకు ఏ హిందీ చిత్రం కూడా సింగిల్ డేలో 86 కోట్ల నెట్‌ను సాధించలేదు. హిందీలో నాలుగు రోజులకు రూ. 291 కోట్లు కలెక్ట్ చేసి, ఇప్పటివరకు ఇంత త్వరగా అంటే కేవలం నాలుగు రోజుల్లోనే 291 కోట్లు కలెక్ట్ చేసిన హిందీ చిత్రంగా నిలిచింది. దీంతో పాటు పలు రికార్డులు కూడా పుష్పరాజ్ కైవసం చేసుకున్నారు. ఒక రికార్డు ప్రకటించే లోపే మరో కొత్త రికార్డును పుష్ప-2 సాధిస్తుండటం యావత్ భారతీయ సినీ పరిశ్రమను సంభ్రమశ్చర్యాలకు గురిచేస్తుంది. రష్మిక మందన్నా నాయికగా నటించిన ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ అద్భుతమైన బాణీలను అందించాడు. కూబా ఫోటోగ్రఫీ సినిమాకు వన్నెతెచ్చింది. ఈ చిత్రం సాధించిన, సాధిస్తున్న వసూళ్లతో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇండియా నెంబర్‌వన్ హీరోగా అందరూ కొనియాడుతున్నారు. దర్శకుడు సుకుమార్ కూడా భారతదేశం గర్వించదగ్గ దర్శకుడిగా టాప్ పాజిషన్‌లో ఉన్నాడు.

## మెగాస్టార్ చిరంజీవి గారు ఓకే చేసిన కథతో "డ్రింకర్ సాయి"



**- ట్రైలర్ లాంచ్ లో డైరెక్టర్ కిరణ్ తిరుమలశెట్టి**

ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "డ్రింకర్ సాయి". బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ నెల 27న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "డ్రింకర్ సాయి" సినిమా ట్రైలర్ ను హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఇస్మాయిల్ షేక్ మాట్లాడుతూ - "డ్రింకర్ సాయి" సినిమా కథను ఎంతబాగా చెప్పారో అంతకంటే బాగా రూపొందించారు మా డైరెక్టర్ కిరణ్ గారు. ఈ సినిమాను బాగా తెరకెక్కించడం కోసం టీమ్ లోని ప్రతి ఒక్కరూ శ్రమించారు. చంద్రబోస్ గారు ఆరు పాటలను అద్భుతంగా రాశారు. అవన్నీ కథను మరింత ఎలివేట్ చేసేలా ఉంటాయి. ధర్మ ఎంతో డెడికేటెడ్ గా వర్క్ చేశాడు. అడిగి మరీ రీటేక్స్ చేసేవాడు. "డ్రింకర్ సాయి" వంటి ఒక మంచి మూవీతో మీ ముందుకు ఈ నెల 27న వస్తున్నాం. మీ సపోర్ట్ అందిస్తారని కోరుకుంటున్నాం. అన్నారు. నిర్మాత లహరిధర్ మాట్లాడుతూ - "డ్రింకర్ సాయి" సినిమా ట్రైలర్ లో ఎలాంటి ఇంట్రెస్టింగ్ కంటెంట్ ఉందో సినిమాలోనూ అలాంటి కంటెంట్ చూస్తారు. థియేటర్స్ లో మా మూవీని ఎంజాయ్ చేస్తారు. ఫ్యామిలీ ఆడియెన్స్ తో పాటు యూత్ కు బాగా నచ్చేలా సినిమా ఉంటుంది. మా టీమ్ అందరికీ థ్యాంక్స్. అన్నారు.

## అంతకుమించితే ప్రమాదం!



వ్యాయామం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, పరిమితికి మించి శరీరాన్ని ఇబ్బందిపెడుతూ కష్టాలను కొనితెచ్చుకోవద్దని సలహా ఇచ్చింది కథానాయిక రకుల్‌ప్రీత్‌సింగ్. ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యతనిచ్చే ఈ భామ రెండు నెలల క్రితం జిమ్‌లో గాయపడిన విషయం తెలిసింది. 80 కిలోల బరువును ఎత్తే క్రమంలో ఆమె వెన్నెముకపై అధికభారం పడటంతో అనారోగ్యానికి గురైంది. ఇటీవల కోలుకున్న ఈ భామ తన ఆరోగ్యం గురించి అప్‌డేట్ అందించింది. ఆరోగ్యపరంగా శరీరం అందించే సంకేతాలకు జాగ్రత్తగా గమనించాలని, అందుకు అనుగుణంగా నడచుకోవాలని సూచించింది. 'వెన్నెముక గాయం రెండువారాల్లో తగ్గిపోతుందనుకున్నా. కానీ రెండు నెలల టైమ్ పట్టింది. ఈ గాయం వల్ల కఠినమైన వ్యాయామాలకు దూరంగా ఉంటున్నా. సరళమైన ఆహారాన్ని తీసుకుంటున్నా. మన శారీరక పరిమితిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉంటుంది. కానీ ఒక్కోసారి అంతకుమించిన శ్రమతో ఇబ్బంది పెడతాం. అలాంటి తప్పుల వల్లే అనుకోకుండా ప్రమాదంలో పడతాం' అని చెప్పుకొచ్చింది ఇటీవల సినిమాలకు కాస్త గ్యాప్ వచ్చిన రకుల్ ప్రీత్.. రాబోవు ఏడాదిలో తాను నటించిన మూడు చిత్రాలు విడుదలకానున్నాయని తెలిపింది.

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా "ది గర్ల్ ఫ్రెండ్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. ఈ రోజు "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా టీజర్ ను హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ స్పందిస్తూ - "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా టీజర్ లోని ప్రతి విజువల్ ఆకట్టుకుంది. ఈ మూవీని చూసేందుకు వెయిట్ చేస్తున్నా. 8 ఏళ్ల క్రితం రశ్మికను సెట్ లో కలిశా. ఎన్నో గొప్ప విజయాలు సాధిస్తున్నా రశ్మిక వ్యక్తిగతంగా ఇప్పటికే అంతే హంబుల్ గా ఉంది. నటిగా ఆమెకు "ది గర్ల్ ఫ్రెండ్" మరింత బాధ్యతను ఇచ్చింది. సక్సెస్ ఫుల్ గా రశ్మిక ఆ బాధ్యత వహిస్తుందని ఆశిస్తున్నా. ప్రతి ప్రేక్షకుడినీ కదిలించే మంచి కథను ఈ సినిమాతో డైరెక్టర్ రాహుల్ చూపిస్తాడని నమ్ముతున్నా. "ది గర్ల్ ఫ్రెండ్" టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్. అన్నారు.



## "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా టీజర్ రిలీజ్

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.